Follow: @ANNTELUGU

07-08-2025

# మహా పత్రిక

ANN తెలుగు

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 244 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే


- ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ఢిల్లీ ధర్నా
- బీసీ ముసుగులో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు ఇచ్చే కుట్ర
- ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



02

## మళ్లీ తెరపైకి పుష్ప 2 కేసు

- పోలీసుల నివేదికపై అసంతృప్తి
- సీఎస్ కు ఎన్ హెచ్ఆర్ సీ నోటీసు
- ఆరు వారాల్లో మరో నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ సీపీకి ఆదేశం



02

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ

- షాంఘై సహకార సదస్సుకు హాజరు
- గల్వాన్ ఘటన తర్వాత ఇదే తొలిసారి
- చైనాలో చివరిసారిగా 2019లో పర్యటించిన మోదీ



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,02,330 |
| 22 క్యారెట్ | 93,800 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |





# మోదీ మెడలు వంచి బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

## బిల్లును ఆమోదించే వరకు మా పోరాటం ఆగదు


### మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? మిమ్మల్ని గద్దె దించాలా?

- జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా
- రాహుల్ గాంధీని ప్రధాని చేసి రిజర్వేషన్లను సాధించుకుంటాం
- బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకు
- మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు?
- జంతర్ మంతర్ 'బీసీ ధర్నాలో' సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- రిజర్వేషన్ల కోసం కదం తొక్కిన రాష్ట్ర నేతలు.. సంఘీభావం తెలిపిన వివిధ పార్టీలు

02లో



**ఢిల్లీ, మహా:** బీసీల రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసి.. రాష్ట్రపతికి పంపినట్లు తెలిపారు. ఇంతవరకు రాష్ట్రపతి బిల్లును ఆమోదించలేదని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అంత కదం తొక్కారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ జంతర్ మంతర్‌లో తెలంగాణ కాంగ్రెస్ దీక్ష చేపట్టింది. ఈ దీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ దీక్షకు కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, జ్యోతిమణి సెన్నిమలై, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎస్పీ, శివసేన, ఎన్సీపీ ఎంపీలు సంఘీభావం తెలిపారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చే వరకు వదలము అని నినదాలు చేశారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియా కూటమి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.



## భారత్‌పై ట్రంప్ టారిఫ్ మోత

- పెనాల్టీగా మరో 25 శాతం సుంకాలు విధింపు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన
- సంబంధిత ఉత్తర్వులపై కూడా సంతకం చేసినట్లు సమాచారం
- భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు 50 శాతానికి చేరిన వైనం
- అన్యాయం, అసమంజసమైనవి.. ఖండించిన భారత్

07

స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 80,543.99 |
| నిఫ్టీ ↗ | 24,574.20 |

ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

## వంచితులు, పీడితుల తరపున రేవంత్ పోరాటం

- రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది
- ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే

02



## దేశంలోనే తెలంగాణ మోడల్

- 42 శాతం రిజర్వేషన్లకు రేవంత్ ప్రభుత్వం శ్రీకారం
- బీసీ బిల్లుపై కేంద్రం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి
- కాంగ్రెస్ ఎంపీ జ్యోతి మణి, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్

02



ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.35 | 130.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.35 | 130.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.61 | 138.33 |

## ఢిల్లీలో ధర్నా ఓ డ్రామా

### మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చేపట్టిన ధర్నాపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు చేశారు. బీసీలకు 42 శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని అన్నారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని, మాకు బీసీల కన్నా మిగతా 2లో



## మంత్రి పదవి ఇయ్యాల్సిందే...

- నాకు హైకమాండ్ హామీ ఇచ్చింది
- సీఎం భాష మార్చుకోవాలి
- రేవంత్ వెనుక 20 మంది ఆంధ్రా పెట్టుబడిదారులు
- వారి బండారాన్ని త్వరలోనే బయటపెడతా
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

02

## బీసీ రిజర్వేషన్లతో బీజేపీకి సంబంధం లేదు!

- ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలతో కూడిన రిజర్వేషన్లను అంగీకరించం
- బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు
- దాన్ని పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్‌దే
- అంతే కానీ బీజేపీ నెపం నెట్టేస్తామంటే చూస్తూ ఊరుకోం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

02



# కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే

## ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ఢిల్లీ ధర్నా

**బీసీ ముసుగులో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు ఇచ్చే కుట్ర**

**ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా?**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని అరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతికి పంపిన బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ మహాధర్నా చేపట్టింది. కాంగ్రెస్ చేపట్టిన ధర్నాపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 5 శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు. బీసీ ముసుగులో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరవైందని ఎద్దేవా చేశారు.

**ఏ పార్టీ ఏం చేసిందో సిద్ధమా?..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా బీసీని ప్రధాని చేశారా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? చెప్పాలన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో, నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా అన్నారు. ఎంతమంది బీసీలకు ఎంపీ సీట్లు ఇచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నించారు. మీరా.. బీసీల గురించి మాకు నీతులు చెప్పేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనన్నారు. 27 మంది బీసీ కేంద్ర మంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల నుంచి తప్పుకోవాలనుకుంటున్న కాంగ్రెస్.. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కనుమరుగవడం తథ్యమని హెచ్చరించారు.

# మోదీ మెడలు వంచి బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం



(మొదటిపేజీ తరువాయి)

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగాం.. కానీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ తరహాలో దేశంలోనూ జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని మోదీ, అమిత్‌షా చెప్పి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బీసీ బిల్లు ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతామని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రానికి బిల్లు పంపి 4 నెలలు అవుతున్నా ఆమోదించడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ధర్నా చేస్తున్నా కేంద్రానికి కనువిప్పు కలగడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకపోతే.. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధాని చేసి రిజర్వేషన్లు సాధించుకుంటామని ప్రతిఘటించారు. రిజర్వేషన్లు ముస్లింల కోసం కాదు.. బలహీన వర్గాల కోసం ఆయన స్పష్టం చేశారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

**వారి ఓట్లు అడగలేదా?..**

'బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది? తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా? ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా? పేరు బంధం తెగిన బీఆర్ఎస్.. పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా?' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# బీసీ రిజర్వేషన్లతో బీజేపీకి సంబంధం లేదు!

**ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలతో కూడిన రిజర్వేషన్లను అంగీకరించం**

**బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు**

**దాన్ని పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్‌దే**

**అంతే కానీ బీజేపీ నెపం నెట్టేస్తామంటే చూస్తూ ఊరుకోం**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**ఢిల్లీ, మహా:** జంతర్ మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేపట్టిన బీసీ ధర్నాపై కిషన్ రెడ్డి స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.. దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్‌దే అని ఆయన ఉద్ఘాటించారు. అందుకోసం న్యాయ పరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టి సారించి, చిత్తశుద్ధితో పని చేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అది చేయలేక.. బట్ట కాల్చి బీజేపీ మీద వేస్తామంటే చూస్తు ఊరుకోమని కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. చట్టపరమైన, న్యాయపరమైన ప్రణాళిక లేకుండా.. కామారెడ్డి డిక్లరేషన్‌ను రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. 18 నెలలు గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాల అమలు ఊసెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు.

**ఢిల్లీకి వచ్చి పగటివేషాలు..**

ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్ రెడ్డి విమర్శిస్తే.. అది ఆకాశం మీద ఉమ్మేయడమే అని కిషన్ రెడ్డి విర్శించారు. వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. రజకులు, గౌడ్లు.. ఇలా ఏ ఒక్క బీసీ వర్గాన్ని వదలకుండా అందరినీ కాంగ్రెస్ నిట్టనిలువునా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని నిర్వహించడం లేదన్నారు. రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు తప్ప.. సీఎం రేవంత్‌కు బీసీలకు సాధికారత కల్పించే విషయంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. తెలంగాణలో ధర్నా చేస్తే.. ఎవరూ పట్టించుకోరని.. ఢిల్లీకి వచ్చి పగటివేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరు అధికారంలో ఉన్నా.. మజ్లిస్ పార్టీ చెప్పినట్లు పనిచేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారికంగా 10 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే.. బీసీలకు రాజ్యాధికారం కష్టమేననేది తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను బీజేపీ అంగీకరించదని తేల్చి చెప్పారు. దేశంలో మోదీ నేతృత్వంలో ప్రజలకు సుస్థిరమైన పాలన అందుతోందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# ఢిల్లీలో రేవంత్ అండ్ బ్యాచ్ డ్రామా అట్టర్ ఫ్లాప్



(మొదటిపేజీ తరువాయి)

బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు. మీ ధర్నాలో నిజాయితీ లేదని, బీసీలకు 42 శాతం కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్ గాంధీ, ఖర్గే లతో పాటు, తెలంగాణ ప్రజలకు కూడా లేదని సుస్పష్టం అయ్యిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. 'మేం గుజరాత్ లో అడగలేదు, ఉత్తర్ ప్రదేశ్ లో అడగలేదు, మహారాష్ట్రలో అడగలేదు తెలంగాణలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అడుగుతున్నాం' అని రేవంత్ రెడ్డి ప్రసంగిస్తే.. అదే సమయంలో రాహుల్ గాంధీ గారూ.. 'ఈ పోరాటం తెలంగాణ కోసం మాత్రమే కాదు, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటం' అని ట్వీట్ చేస్తరు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్ గాంధీ చెప్పిన మాటలకే పొంతన లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో రెండు నాల్కల ధోరణి చూస్తేనే అర్థమవుతున్నదని అన్నారు.

# మంత్రి పదవి ఇయ్యాల్సిందే..

## నాకు హైకమాండ్ హామీ ఇచ్చింది.. సీఎం భాష మార్చుకోవాలి

**రేవంత్ వెనుక 20 మంది ఆంధ్రా పెట్టుబడిదారులు**

**వారి బండారాన్ని త్వరలోనే బయటపెడతా.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. సీఎం వెనుక 20 మంది ఆంధ్రా పెట్టుబడిదారులు ఉన్నారని, వారంతా తెలంగాణ సంపదను దోచుకుంటున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా వేదికగా మరోసారి స్పందించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీఎం రేవంత్ వెనుక ఉన్న ఆంధ్రా కాంట్రాక్టర్ల బండారం బయటపెడతానన్నారు. రేవంత్ రెడ్డి మాటతీరు, పనితీరుపై రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలన్నారు. ప్రతిపక్షాలను తిట్టడం మానేసి, ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలన్నారు. సీమాంధ్ర కాంట్రాక్టర్లు తెలంగాణను దోచుకుంటున్నారన్నారు. నాకు మంత్రి పదవి విషయంలో హైకమాండ్ ప్రామిస్ చేసిందని, తనకు హైకమాండ్ మాట ఇచ్చిన విషయం తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి తెలియదన్నారు. అందరూ కలిస్తేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. "సీఎం రేవంత్ తన భాష, హావభావాలు మార్చుకోవాలి. ఆయన గంటల తరబడి మాట్లాడకుండా, ఆ శ్రద్ధను పని మీద చూపించాలి. ఆవేశం పనిచేయదు, కూల్ మైండ్‌తో పనిచేయాలి" అని సూచించారు. ముఖ్యమంత్రి పదవి గురించి మాట్లాడుతూ, "ఇంకో మూడున్నర ఏళ్లు ఆయనే సీఎం. ఆ తర్వాత ఎవరు అనేది అధిష్ఠానం మరియు ప్రజలు నిర్ణయిస్తారు" అని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను మరోసారి బహిర్గతం చేశాయి. సోషల్ మీడియా విషయంలో ఓడ దాటే వరకు ఓడ మల్లన్న.. ఓడ దాటిన తర్వా బోడ మల్లన్న అన్నట్లు సీఎం రేవంత్ వైఖరి ఉందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా జర్నలిస్టులపై మండిపడిన సంగతి తెలిసిందే. ఆ విషయంలోనే ఇప్పటికే ట్విట్టర్ వేదికగా కౌంటర్ ఇచ్చిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. తాజాగా మరోసారి టార్గెట్ చేశారు. పనిలో పనిగా మాజీ సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి కూడా రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తూ అధికారం కోల్పోయిన ఫ్రస్ట్రేషన్ లో బీఆర్ఎస్ ఉందని తెలిపారు. అసెంబ్లీకి రాని కేసీఆర్ ముందుగా తన ప్రతిపక్ష హోదా పదవికి రాజీనామా చేయాలన్నారు.

### వంచితులు, పీడితుల తరపున

# రేవంత్ పోరాటం

- రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది
- ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే

**ఢిల్లీ, మహా :** వంచితులు, పీడితుల తరపున రేవంత్‌రెడ్డి పోరాడుతున్నాని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. సీఎం అవుతానని రేవంత్‌రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని.. కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మాత్రమే చెప్పారని ఒక కార్యకర్త.. జీరో నుంచి సీఎం వరకు ఎదిగారని చెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చేపట్టిన ధర్నాకు సుప్రియా సూలే, డీఎంకే ఎంపీ కనిమొళి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రియా సూలే మాట్లాడారు. 'దేశంలో తొలిసారి 69 శాతం రిజర్వేషన్లను కరుణానిధి అమలుచేశారు. అంబేద్కర్ మాదిరిగానే కరుణానిధి పేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి పేరు కూడా చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాంగ్రెస్‌తో శరద్‌పవార్‌కు మంచి అనుబంధం ఉంది. కాంగ్రెస్‌కు మా పార్టీ అండగా నిలుస్తుంది' అని సుప్రియా సూలే అన్నారు.

# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల్లో నిజం లేదు

## పార్టీ నిబంధనలు ఎవరు పట్టించుకోకపోయినా చర్యలు తప్పవు

**రాజగోపాల్ రెడ్డితో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం**

**కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి వెల్లడి**



**ఢిల్లీ, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సొంత పార్టీ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తాజాగా రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని రాజగోపాల్ రెడ్డి విమర్శించడంపై ఉన్న కారణం ఏంటో తెలుసుంటామని మల్లు రవి తెలిపారు. ఇవాళో, రేపో రాజగోపాల్ రెడ్డితో మాట్లాడి వివరాలు తీసుకుంటామని చెప్పారు. రాజగోపాల్ రెడ్డితో మాట్లాడిన తర్వాత ఏం చేయాలనే దానిపై నిర్ణయం ఉటుందని స్పష్టం చేశారు. అన్ని విషయాలపై రాజగోపాల్ రెడ్డి నుంచి త్వరలోనే వివరణ తీసుకుంటామని పేర్కొన్నారు. రెండు రోజులగా బీసీ ధర్నా ఏర్పాట్లలో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను ఎవరు పట్టించుకోకపోయినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని మల్లు రవి తేల్చి చెప్పారు.

# దేశంలోనే తెలంగాణ మోడల్

- 42 శాతం రిజర్వేషన్లకు రేవంత్ ప్రభుత్వం శ్రీకారం
- బీసీ బిల్లుపై కేంద్రం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి
- కాంగ్రెస్ ఎంపీ జ్యోతి మణి, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్

**ఢిల్లీ, మహా:** బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై కేంద్రం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని సమాజ్ వాదీ పార్టీ లోక్ సభ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతికి పంపిన బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ మహాధర్నా చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతిచ్చి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి సమాజ్ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. బీసీల రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా పెంచాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో చేసే పోరాటానికి తమ పార్టీ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీ జ్యోతి మణి మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ మోడల్‌గా మారిందన్నారు. 42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. హామీ ఇచ్చిన విధంగా 42 శాతం రిజర్వేషన్లను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం చేసి చూపించిందన్నారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతిపక్షంగా విఫలమైన బీఆర్ఎస్

## మాజీ ఎమ్మెల్యే బాలరాజు సంచలన వ్యాఖ్యలు



**నాగర్ కర్నూలు, మహా :** బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆ పార్టీపై సంచలన వ్యాఖలు చేశారు. బుధవారం నాగర్ కర్నూలులో విలేకర్లతో మాట్లాడుతూ, అసమర్థ నాయకత్వం కుట్రలు చేసి తనను ఓడించిందంటూ బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. అన్యాయాన్ని ఎదిరించే పాత్రను ప్రతిపక్షం బీఆర్ఎస్ పోషించడం లేదన్నారు. కార్యకర్తలకు కష్ట కాలంలో పార్టీ అది నాయకత్వం అండగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఏమి ఆశిస్తున్నారో అది చేయకుండా.. అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం చేసుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో (గువ్వల బాలరాజు రూ. 100 కోట్లకు అమ్ముడుపోలేదని స్పష్టం చేశారు. గువ్వల బాలరాజు అంటేనే ఒక సెన్సేషన్..జీబీఆర్ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడకూడదంటే ఒప్పుకోడంటూ తన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కుండ బద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఏం ఆదేశిస్తే అదే తాను చేశానని చెప్పుకొచ్చారు. పేదరిక నిర్మూలన.. ప్రజల పక్షమే తన పంతమన్నారు. తనకు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అది నాయకత్వం నుంచి పిలుపు వచ్చింది కానీ తన వాయిస్ ప్రజల పక్షాన బతికి ఉండాలంటే స్వేచ్ఛ ఉన్న పార్టీ తనకు కావాలని పేర్కొన్నారు. తొందరలో తన దారి ఏమిటో నిర్ణయిస్తానని స్పష్టం చేశారు. తనతో కలిసి రావాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. బాలరాజు ఆగస్ట్ 4వ తేదీన బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. ఆ లేఖను పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా బాలరాజు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆ పదవికి సైతం ఆయన రాజీనామా చేశారు.

**రాజీనామా లేఖలో కాలక అంశాల ప్రస్తావన**

బీఆర్ఎస్ కు రాసిన రాజీనామా లేఖలో బాలరాజు కీలక విషయాలను ప్రస్తావించారు. పార్టీకి రాజీనామా నిర్ణయం అంత ఈజీగా తీసుకున్నది కాదన్నారు. ఎంతో ఆలోచించి ఎన్నో విషయాలను పరిగణలోకి తీసుకుని అనంతరం బాధతో పార్టీని వీడుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆ సమయంలో తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. కేసీఆర్ వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని స్పష్టం చేశారు. కష్ట సమయంలో పార్టీని వీడడం బాధగా ఉన్నా భవిష్యత్తు కోసం తప్పడం లేదంటూ ఆ లేఖలో గువ్వల బాలరాజు వివరించారు.

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ

- షాంఘై సహకార సదస్సుకు హాజరు
- గల్వాన్ ఘటన తర్వాత ఇదే తొలిసారి
- చైనాలో చివరిసారిగా 2019లో పర్యటించిన మోదీ

**ఢిల్లీ, మహా:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదు సార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్‌చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది. చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

# మళ్లీ తెరపైకి పుష్ప 2 కేసు

**పోలీసుల నివేదికపై అసంతృప్తి.. సీఎస్ కు ఎన్ హెచ్ఆర్ సీ నోటీసు**

**ఆరు వారాల్లో మరో నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ సీపీకి ఆదేశం**




**న్యూఢిల్లీ, మహా :** గత ఏడాది డిసెంబర్ లో హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన దర్యాప్తుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ అసహనం వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పుష్ప2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై హైదరాబాద్ పోలీసులు సమర్పించిన నివేదికపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ అసంతృప్తి వ్యక్తం చేసింది. బాధిత కుటుంబానికి పరిహారమిచ్చేలా ఆదేశాలు ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలని ప్రశ్నించింది. ప్రీమియర్ షోకు అనుమతి లేదని పోలీసులు రిపోర్టులో పేర్కొన్నారన్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ అనుమతి లేకుంటే నటుడు, అభిమానులు ఎందుకొచ్చారో తెలియట్లేదని సందేహించింది. అనుమతి లేనప్పుడు ముందే చర్యలు తీసుకోవాల్సిందని అప్పుడే జాగ్రత్త పడి ఉంటే తొక్కిసలాట జరిగేది కాదని అభిప్రాయపడింది. పూర్తిస్థాయి దర్యాప్తు చేసి మరో నివేదిక 6 వారాల్లో ఇవ్వాలని, దర్యాప్తు నిష్పక్షపాతంగా చేయాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు ఆదేశాలు జారీ చేసింది.

పుష్ప2 సినిమా మొదటి ఆట చూడాలని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి, భాస్కర్ దంపతుల కుమారుడు శ్రీతేజ్ మారాం చేయడంతో కుటుంబంతో సినిమా థియేటర్‌కు 2024 డిసెంబరు 5న వెళ్లారు. కానీ దురదృష్టవశాత్తు అక్కడ జరిగిన తొక్కిసలాటలో రేవతి (35) మృతి చెందింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి ఆమె మృతి చెందిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్, రేవతి అనే దంపతులకు కుమారుడు శ్రీతేజ్(9), కుమార్తె సన్విక ఉన్నారు. భాస్కర్‌కు 9 నెలల క్రితం లివర్ చెడిపోయిందని వైద్యులు చెప్పడంతో తన కాలేయంలో కొంతభాగమిచ్చి రేవతి తన భర్తను బతికించుకుంది. కుమారుడు శ్రీతేజ్ చిన్నప్పటినుంచే అల్లుఅర్జున్ సినిమాల్లోని పాటలకు స్టెప్పులేస్తుంటే చూసి తెగ మురిసిపోయేది. పుష్ప2 విడుదలయ్యాక మొదటి ఆటకు తీసుకెళ్లాలని తల్లితో మాట తీసుకున్నాడు శ్రీతేజ్. దీంతో కొడుకిచ్చిన మాట ప్రకారం పెట్టి బెనిఫిట్ షో టికెట్లను కొనుగోలు చేసింది. పుష్ప2 ప్రీమియర్ షోకు కుటుంబ సభ్యులంతా కలిసి రాత్రి సంధ్య థియేటర్‌కు చేరుకున్నారు. అప్పటికే అభిమానుల కోలాహలంతో థియేటర్ పరిసరాలలో సందడి నెలకొంది. ఆ సమయంలో ఫ్యాన్స్‌తో కలిసి సినిమా చూడటానికి హీరో అల్లు అర్జున్ రాడంతో ఒక్కసారిగా థియేటర్ లోపలికి పెద్ద ఎత్తున అభిమానులు చొచ్చుకొచ్చారు. ఈ క్రమంలో తోపులాట జరగడంతో శ్రీతేజ్ అక్కడే కిందపడిపోయాడు. అతన్ని లేపడానికి యత్నిస్తూనే రేవతి సైతం కింద పడిపోయింది. కొద్దిక్షణాల్లోనే వారిద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే తల్లి రేవతి ఊపిరి ఆగిపోయింది. చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న శ్రీతేజ్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. శ్రీతేజ్ కోమాలోకి వెళ్లడంతో ప్రభుత్వం ట్రీట్‌మెంట్ కోసం ఆర్థిక సాయం అందించింది.

# బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే చరిత్ర

**కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నాం**

**కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా**

**బీసీ ధర్నాపై ఎక్స్‌లో ఎంపీ రాహుల్ గాంధీ ట్వీట్**



**ఢిల్లీ, మహా:** ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు. 'కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసమే కాదు.. దేశంలోని అణగారిన వర్గాలందరి కోసం. ఈ ధర్నాకు హాజరైన ఇండియా కూటమి నేతలకు ధన్యవాదాలు'అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# డీకే శివకుమార్‌తో రాజగోపాల్ రెడ్డి భేటీ

- **హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో కలిసిన ఎమ్మెల్యే**
- **ప్రస్తుత రాజకీయ పరిణామాలపై డిప్యూటీ సీఎంతో చర్చ!**
- **మంత్రి పదవులు, ఇతర అంశాలపై డిస్కషన్ జరగలేదు: కోమటిరెడ్డి**
- **మర్యాదపూర్వకంగానే డీకే శివకుమార్‌ను కలిసినట్లు వెల్లడి**



**హైదరాబాద్, మహా:** కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన శివకుమార్‌తో ఓ ప్రైవేట్ హోటల్‌లో సమావేశమయ్యారు. మంత్రి పదవి లభించకపోవడంతో అసంతృప్తితో ఉన్న రాజగోపాల్ రెడ్డి, డీకే శివకుమార్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ భేటీకి గల కారణాలపై ఊహాగానాలు మొదలయ్యాయి. సీఎం రేవంత్‌పై ఇటీవల రాజగోపాల్ రెడ్డి వరుస విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొన్ని రోజులుగా మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్ గా మారారు. సీఎం రేవంత్ రెడ్డిపై నిత్యం విమర్శలు చేస్తూ వార్తల్లోనిలుస్తున్నారు. తాను పదేళ్లు సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చెబితే.. అది కాంగ్రెస్ పార్టీ విధానం కాదంటూ కౌంటర్ ఇచ్చారు. ఆ తర్వాత కూడా ఏకంగా సీఎం తన భాష మార్చుకోవాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలను తిట్టడం మానేసి.. ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలని సూచించారు.

**ఎలాంటి చర్చ జరగలేదు: కోమటిరెడ్డి**

మంత్రి పదవి విషయంలో అసంతృప్తితో ఉన్న రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడైన డీకే శివకుమార్‌ను కలవడం వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా, ఇలాంటి భేటీలు పార్టీలో అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవడానికి లేదా భవిష్యత్ రాజకీయ ప్రణాళికలను చర్చించుకోవడానికి ఉపయోగపడతాయి. అయితే, రాజగోపాల్ రెడ్డి ప్రకటనతో ఈ భేటీ కేవలం స్నేహపూర్వక సమావేశమే అని తెలుస్తోంది. అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలను ఇది మరింత ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమావేశం గురించి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టతనిచ్చారు. తమ భేటీలో రాజకీయాలు, మంత్రి పదవుల గురించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన తెలిపారు. తామిద్దరం చాలా కాలంగా మంచి స్నేహితులమని, కేవలం వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడుకోవడానికే కలుసుకున్నామని స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు

- **మీకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టండి**
- **దమ్ముంటే కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయండి**
- **కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ డీకే అరుణ ఛాలెంజ్**



**హైదరాబాద్, మహా:** ఢిల్లీలో కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్ల ధర్నాపై బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శలు చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ.. మీకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక.. బీజేపీని బద్నాం చేస్తామంటే ఊరుకోమన్నారు. 'చిత్తశుద్ధి ఉంటే.. ఇచ్చిన మాట ప్రకారం 42శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇవ్వండి. ఇందులో 10శాతం ముస్లిం మైనార్టీలకు ఇస్తామనడం బీసీలను మోసం చేయడం కాదా..? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. అందుకే బీసీ రిజర్వేషన్ల పేరుతో మరోసారి డ్రామాలు చేస్తోంది. ఎన్నికలొచ్చిన ప్రతిసారీ.. కాంగ్రెస్‌కు ఇలాంటివి కామనే. ఢిల్లీలో కాంగ్రెస్ బీసీ ధర్నా అందులో భాగమే.

**కాంగ్రెస్‌కు ఓటమి భయం..**

కాంగ్రెస్ ఎప్పట్నుంచో బీసీలకు వ్యతిరేకమే. బీసీలను ఓటు బ్యాంకుల రాజకీయంగా వాడుకున్నది కాంగ్రెస్ కాదా..? ఎన్నికలొచ్చినప్పుడల్లా బీసీ రాగం ఎత్తుకోవడం వీళ్లకు అలవాటే. మీకు దమ్ముంటే ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ ను అమలు చేయండి. అంతేగాని ఓట్ల కోసం ఢిల్లీలో ధర్నాలు చేస్తాం, బీజేపీ బద్నాం చేస్తామంటే ఊరుకునే పరిస్థితి లేదు. ఆ భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది. బీజేపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోంది. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లలో 10శాతం ముస్లిం మైనార్టీలకు అంటే మీరు బీసీలను మోసం చేసినట్లు కాదా..? దీనికి కాంగ్రెస్ పార్టీ నేతలు సమాధానం చెప్పాలి' అని డీకే అరుణ డిమాండ్ చేశారు.

# భారత్ బలంగానే ఉంది

**అమెరికానే పాపం.. ట్రంప్‌కి ఆర్‌బీఐ గవర్నర్ స్ట్రాంగ్ కౌంటర్**

**ఇంటర్నెట్ డెస్క్ :** భారత్ ఒక డెడ్ ఎకానమీ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేసిన వ్యాఖ్యలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఘాటైన కౌంటర్ ఇచ్చారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలంగానే ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి అమెరికాతో పోలిస్తే భారత్ ఎక్కువ దోహద పడుతోందని గుర్తు చేశారు. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలోని నిర్ణయాల ప్రకటన సందర్భంగా ఈ విషయంపై మాట్లాడారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) గణాంకాల ప్రకారం గ్లోబల్ ఎకానమీ వృద్ధి రేటు 3 శాతంగా ఉందని, కానీ భారత్ వృద్ధి అంచనాలు 6.50 శాతంగా ఉన్నట్లు గుర్తు చేశారు. 'ప్రపంచ వృద్ధికి భారత్ సుమారు 18 శాతం దోహదపడుతుంటే అమెరికా కంట్రిబ్యూషన్ మాత్రం 11 శాతం కంటే తక్కువగానే ఉందని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలంగా ఉంది. మరింత పురోగతి సాధిస్తాం' అని పేర్కొన్నారు. భారత జీడీపీపై అమెరికా విధించిన సుంకాల ప్రభావంపైనా మాట్లాడారు. అమెరికా సుంకాల ప్రభావాన్ని ప్రస్తుతానికి అంచనా వేయలేమన్నారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు భారత వృద్ధిపై ప్రభావం చూపవచ్చని అభిప్రాయపడ్డారు. అమెరికాపై భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే తప్పా మన ఆర్థిక వ్యవస్థపై అంత ప్రభావం ఉండదన్నారు. 'వృద్ధిపై అంచనాలు ఇప్పటికే చాలా తగ్గించాం. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో వృద్ధి అంచనాలు 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గించాం. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా సుంకాల ప్రభావం అంచనా వేయడం కష్టమే. ప్రస్తుతానికి జీడీపీ అంచనాలను సవరించేందుకు మా వద్ద తగినంత డేటా లేదు 'అని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులను విధాన పరమైన అంశాల వారీగా పర్యవేక్షిస్తామన్నారు. అందుకు తగినట్లుగానే నిర్ణయాలుంటాయన్నారు. ప్రస్తుతం అనిశ్చితి కొనసాగుతోందని వడ్డీ రేట్లు 100 బేసిస్ పాయింట్ల మేర ఇప్పటికే తగ్గించామని గుర్తు చేశారు. ధరల స్థిరత్వాన్ని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాని తెలిపారు. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందం చర్చలు సామరస్యంగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆగస్టు 6తో ముగిసిన ద్వైమాసిక సమావేశంలో కీలక పాలసీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు.

# గేమింగ్ యాప్ వేరు... బెట్టింగ్ యాప్ వేరు

**నేను గేమింగ్ యాప్ కోసమే ప్రచారం చేశా**

**ఈడీ విచారణకు నటుడు విజయ్ దేవరకొండ**

**పారితోషికం, కమీషన్లపై ఆరా తీసిన ఈడీ**



**హైదరాబాద్, మహా :** బెట్టింగ్ యాప్ ప్రచారం వ్యవహారంలో నటుడు విజయ్ దేవరకొండ బుధవారం ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ ప్రచారం కేసులో నాలుగున్నర గంటలపాటు ఈడీ అధికారులు విజయ్ దేవరకొండను పలు ప్రశ్నలు అడిగారు. మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో విచారణ జరిగినట్లు సమాచారం. తాను గేమింగ్ యాప్ కోసం ప్రచారం చేసినట్లు విజయ్ దేవరకొండ ఈడీ విచారణ అనంతరం మీడియాకు తెలిపారు. కొన్ని గేమింగ్ యాప్స్ చట్టబద్ధమైనవేనన్న విజయ్ గేమింగ్ యాప్స్‌కు, బెట్టింగ్ యాప్స్‌కు తేడా ఉందని పేర్కొన్నారు. ఈడీ తనను అడిగిన వివరాలు అకౌంట్, కంపెనీ, లావాదేవీల వివరాలు ఇచ్చానని అన్నారు. ప్రచారం చేసిన యాప్ వివరాలు అడిగితే చెప్పానని, వివరాలతో ఈడీ అధికారులు సంతృప్తి చెందినట్లు విజయ్ తెలిపారు.

**నేను చేసింది గేమింగ్ యాప్ కోసమే**

తప్పు, ఒప్పులు చెప్పేందుకు కోర్టులు, ప్రభుత్వాలున్నాయని, లీగల్ యాప్స్‌నకు జియో లొకేషన్ లాక్ ఉంటుందని విజయ్ దేవరకొండ తెలిపారు. తాను ప్రచారం చేసిన ఏ 23 యాప్ తెలంగాణలో ఓపెన్ చేయాలని ప్రయత్నించినా ఓపెన్ కాదన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ యాప్‌లను అనుమతించాయని పర్మిషన్ ఉన్న ప్రాంతంలోనే యాప్ పనిచేస్తుందని అన్నారు. "నేను గేమింగ్ యాప్ కోసం ప్రచారం చేశా. కొన్ని గేమింగ్ యాప్స్ చట్టబద్ధమైనవి. గేమింగ్ యాప్స్, బెట్టింగ్ యాప్స్‌కు తేడా ఉంది. ఈడీ నన్ను అడిగిన వివరాలు ఇచ్చాను. అకౌంట్, కంపెనీ, లావాదేవీల వివరాలు ఇచ్చా. నేను ప్రచారం చేసిన యాప్ వివరాలు అడిగితే చెప్పాను. నేను చెప్పిన వివరాలతో ఈడీ అధికారులు సంతృప్తి చెందారు. తప్పు, ఒప్పులు చెప్పేందుకు కోర్టులు, ప్రభుత్వాలున్నాయన్నారు. బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఇప్పటికే నటుడు ప్రకాష్‌రాజ్‌ను ఈడీ అధికారులు విచారించారు. ఈ నెల 11న నటుడు రానా, 13న నటి మంచు లక్ష్మిని కూడా ఈడీ విచారించనుంది. ఈ కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు భావిస్తున్న ఈడీ ఈసీఐఎన్ఆర్ నమోదు చేసి దర్యాప్తు జరుపుతోంది. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లకు సంబంధించి 29 మంది సినీ సెలబ్రిటీలు, కంపెనీలపై ఈడీ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అందులో సినీ నటులు రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్, శ్రీముఖి, అనన్య నాగళ్ల వంటి తదితరులపై సైబరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణను జరుపుతోంది. అలాగే సినీ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్స్‌ను పీఎంఎల్ఏ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారిస్తోంది. ఇప్పటికే నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో యాంకర్లు, బుల్లితెర నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల నుంచి సినీ ప్రముఖుల వరకు అందరిపైనా తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రణీత, వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల, బుల్లితెర నటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు శ్రీముఖి, సిరి హనుమంతు, శోభాశెట్టి, వర్షిణి సౌందరరాజన్, నేహాపఠాన్, నయని పావని, వసంతి కృష్ణన్, పద్మావతి, విష్ణు ప్రియ, పండు, ఇమ్రాన్‌ఖాన్, భయ్యా సన్నీయాదవ్, రీతూ చౌదరి, హర్షసాయి, టేస్టీ తేజ, బండారు సుప్రీత తదితరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. బీఎన్ఎస్‌లోని 318(4), 112, రెడ్‌విత్ 49, తెలంగాణ గేమింగ్ యాక్ట్‌లోని 3, 3(ఏ), 4 సెక్షన్లు, ఐటీ చట్టం 2000, 2008లోని 66డి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసును దర్యాప్తు చేస్తుంది. చట్టవిరుద్ధ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు విస్తృతంగా ప్రచారం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

# బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో లేవనెత్తుతాం

**లోక్ సభ డిప్యూటీ ప్రతిపక్ష నేత గౌరవ్ గొగోయ్**



**ఢిల్లీ, మహా:** బీసీల పక్షాన కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాటం చేస్తుందని లోక్ సభ డిప్యూటీ ప్రతిపక్ష నేత గౌరవ్ గొగోయ్ పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతికి పంపిన బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో గౌరవ్ గొగోయ్ పాల్గొని మాట్లాడారు. బీసీల 42 శాతం రిజర్వేషన్‌లను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో బీసీ రిజర్వేషన్‌ల అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతామని స్పష్టం చేశారు.




EDITORIAL సంపాదకీయం

# వరాలిచ్చే కల్పవల్లి.. వరలక్ష్మీ రావమ్మా

**పరిచయం:**

మన దేశంలోని సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, మహోత్కృష్టంగా ఉంటాయి. ప్రకృతి అంతటిలోనూ దైవాన్ని దర్శించటం, ఆ దైవానికి ఆయా సందర్భాల్లో పూజలు జరపటం మన విశిష్టత. మన సంప్రదాయంలో ప్రతిరోజూ, ప్రతివారం, ప్రతి మాసం, ప్రతి తిథి, ప్రతి నక్షత్రమూ, అన్నిటికీ ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నది. మన తెలుగు వారు పాటించే సంప్రదాయం చాంద్రమాసం ఇందులో ప్రతి నెలకూ వైశిష్ట్యం ఉన్నప్పటికీ, శ్రావణ మాసం విభిన్నమైన ప్రత్యేకత కలిగిన నెల. స్త్రీలు నియమ నిష్టలతో పాటించే వ్రతాలు, పండుగలు ఈ నెల నుండి ప్రారంభమవుతాయి. అందుకనే ఈ నెలను 'వ్రతాల నెల' అని అంటారు. శ్రావణమాసంలో శుక్రవారాలు, మంగళవారాలు ప్రత్యేకతను కలిగినవి. శుక్రవారాలు వరలక్ష్మీ వ్రతం, మంగళవారం మంగళగౌరీ వ్రతము భక్తి ప్రపత్తులతో స్త్రీలు జరుపుకుంటారు.

**శ్లోకం:**

లక్ష్మీం క్షీర సముద్ర రాజతనయాం శ్రీరంగ ధామేశ్వరీం,
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం
శ్రీ మన్మంద కటాక్షలబ్ధివిభవత్ బ్రహ్మేంద్ర గంగాధరాం
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజం వందే ముకుందప్రియం||

**శ్రీ మహాలక్ష్మీ వైశిష్ట్యం:**

వైకుంఠపురంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ క్షీరసాగరంలో ఉద్భవించింది. స్వర్గంలో స్వర్ణలక్ష్మి, ఇంద్రలక్ష్మి, మహారాజులపాలిట రాజ్యలక్ష్మి, స్త్రీలకు ఆమె సౌభాగ్యలక్ష్మి, వరాలనిచ్చే వరలక్ష్మి. భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరలక్ష్మీ దేవి. శ్రీమహావిష్ణువు దేవేరి లక్ష్మీదేవి, అష్టావతారాలలో వరలక్ష్మీ ఒకరు. మహాలక్ష్మీ సంపదల తల్లి, సంపద అనే మాటకు సనాతన ధర్మంలో అనేక అర్థాలున్నాయి. ధనం, పుష్టి, ఆరోగ్యం, మిత్రత్వం, సౌమనస్యం, శాంతి, కలహంలేని పరిస్థితి బలం అనుకూలమైన కుటుంబం, కార్యసిద్ధి, విజయం, చిరునవ్వు, ఇవన్నీ లక్ష్మీ రూపాలు. ఈ సంపదలన్నింటి సమాహార స్వరూపాన్ని లక్ష్మీదేవిగా ఉపాసించారు మహర్షులు. ఇవన్నీ శ్రీవిభూతులు. వీటిని పొందాలంటే తగిన సాధన, అర్హత ఉండాలని ధార్మిక గ్రంథాలు బోధించాయి. మహాభారతంలో భీష్ముడు గొప్ప వృత్తాంతాన్ని వివరించారు. ఒకప్పుడు దైత్యులవద్ద లక్ష్మీదేవి నెలకొని సంపదలన్నీ ప్రసాదించింది. కానీ, ఒకసారి వారిని వదలి, యోగ్యుడైన ఇంద్రుడి ముందు ప్రత్యక్షమైంది.

'శ్రీమహాలక్ష్మిని' ఉద్దేశించి అమ్మా! నువెవ్వరు? ఎందుకు వచ్చావు? ఎక్కడినుంచి వస్తున్నావు? ఎక్కడికి వెళుతున్నావు? అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. అప్పుడు శ్రీమహాలక్ష్మీ దేవేంద్రుడితో సంభోదిస్తూ... ఒకప్పుడు దైత్యులు ధర్మనిరతులై, ధైర్యంతో సత్యాన్ని, సన్మార్గాన్ని వదలకుండా ఉండేవారు. అందుకే వారివద్ద నేనున్నాను. నా ఉనికితో వారంతా ఉన్నత స్థితిని, వైభవ విజయాలను అనుభవించారు. కానీ, స్వయంగా ధన మదంతో, విజయాల గర్వంతో సత్య, ధర్మాలను విడిచిపెట్టారు. ధర్మవిరుద్ధమైన భోగాల వెంట పడ్డారు. క్రోధాల్ని పెంచుకున్నారు. ఈర్ష్యాసూయలకు లోనయ్యారు. దానితో వారిని వదిలిపెట్టాను. పరిశుభ్రత, సదాచారం, క్రమశిక్షణ ఉన్నంతకాలం వారి వద్ద ఉన్నాను. సధర్మాన్ని పాటించేవారివద్ద, ధైర్యంతో సత్కార్యాలు చేసేవారి చెంత నేనుండి కరుణిస్తాను. దానం, అధ్యయనం, దైవపూజ, గురుపూజ, అతిథిపూజలను పాటించేవారి ఇంట నేనుంటాను. ఇంటిని శుభ్రంగా ఉంచినవారు, స్త్రీలను గౌరవించేవారు, జితేంద్రియులు, సత్యవాదులు నా కరుణకు తగినవారు. దయామయులు, కృతజ్ఞులు, ప్రియంగా మృదువుగా మాట్లేవారు, నియమబద్ధంగా జీవించేవారు..... నా అనుగ్రహానికి పాత్రులు. వారిని నేను విడిచిపెట్టను, సంధ్యాకాలంలో నిద్రపోనివారు, తల్లిదండ్రులను, ఆచార్యులను గౌరవించేవారు, సంపదలకు అర్హులు. దానవులు భోగలాలసులై ఈ మర్యాదలన్నీ అతిక్రమించటంచేత వారి స్థానాలను నేను వదిలిపెట్టాను.

ధర్మ, సత్య, శీలాదిసద్గుణాలను కలిగిఉన్న కారణంగా నిన్ను అనుగ్రహిస్తున్నాను. అన్న లక్ష్మీదేవి మాటలు విని ఇంద్రుడు ఆమెను పూజించాడు. ఈ వృత్తాంతము 'భారతం' శాంతి పర్వంలోనిది. పాలకులు, ప్రజలు భోగాలాలస వీడి నీతినియమాలతో జీవన విధానాన్ని అలవర్చుకోవడమే నిజమైన లక్ష్మీవ్రతం. మంచి లక్షణాల స్వరూపమే లక్ష్మీదేవి అనేది సారాంశం. పై ఇతివృత్తం ద్వారా భీష్ముడు ధర్మరాజుకు గొప్ప హితము బోధించాడు.

**వరాలతల్లీ 'వరలక్ష్మి'**

శ్రావణమాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ నామాంకితమైన శుభదినం. సిరిసంపదలను కాంక్షించే మానవులందరూ శ్రద్ధగా శ్రీమహాలక్ష్మిని విశేష పూజలతో, వ్రతాచరణతో మొక్కుకొనే చక్కని సందర్భం. లక్ష్మీ అంటే సిరిసంపదలే కాదు. కళలూ, కాంతులనూ, శోభనలనూ, సౌందర్యాన్ని, శుభాలను సూచిస్తుంది. వాటన్నింటికీ వరలక్ష్మీదేవి అధిష్టానదేవత. ఆమె అష్టలక్ష్మీ స్వరూపిణీ. మనిషి యోగక్షేమాలకూ, సుఖజీవనానికీ, కావలసిన వనరులనూ ఎనిమిది భాగాలు చేస్తే అవన్నీ లక్ష్మీదేవి రూపాలే. "ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మీ, విజయలక్ష్మి, విద్యాలక్ష్మీ, ధనలక్ష్మీ" అని వరలక్ష్మీ తల్లి అష్టరూపాలు. ఆమెను పూజిస్తే అన్ని లభిస్తాయి. మనకే కాదు, ఆమె సమస్త దేవతా వనితలను వశంచేసుకున్న మహారాణి. బ్రహ్మకూ, ఇంద్రుడికీ, గంగాధరుడుకీ వైభవాన్నిచ్చేది వరలక్ష్మీ తల్లి కటాక్షమే. వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్ని ఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమే కాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలి. ఆ రోజున వీలుకాకపోతే తరువాత వచ్చే శుక్రవారాలలో కూడా ఈవ్రతాన్ని చేసుకోవచ్చు. వరలక్ష్మీ వ్రత కథలోని నాయిక చారుమతి. చారుమతి ఈ సులక్షణాల వల్లనే వరలక్ష్మీ కరుణకు నోచుకుందని పురాణ సందేశం. వరలక్ష్మీ వ్రతానికి ఆది దేవతయెన లక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. సువాసినులందరూ చేసే ప్రాభవ వ్రతం. 'శ్రీ వరలక్ష్మీ నమస్తు వసుప్రదే, సుప్రదే' శుక్రవారం రోజున జరుపుకునే వరలక్ష్మీ వ్రతంతో ధన, కనక, వస్తు, వాహనాది సమృద్ధులకు మూలం. శ్రావణ శుక్రవార వ్రతాలతో పాపాలు తొలిగి లక్ష్మీ ప్రసన్నత కలిగి లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుంది.



**వరలక్ష్మీ వ్రతం: పూజా విధానం.. పాటించాల్సిన నియమాలు, తోరం, వ్రత కథ**

శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రావణం పేరుతో వచ్చే మానం శ్రావణం. చాంద్రమాన ప్రకారం.. తెలుగు సంవత్సరాదిలో ఐదో నెల శ్రావణం. ఈ నెలలో నోములు, వ్రతాలు, పూజలకు ప్రశస్తి. భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరలక్ష్మీ దేవి. శ్రీమహావిష్ణువు దేవేరి లక్ష్మీదేవి అష్టావతారాలలో వరలక్ష్మీ ఒకరు. ఆ వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్ని చేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

**వ్రత విధానం**

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించే రోజున ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోవాలి. ఇంట్లోని పూజా మందిరంలో ఒక మండపాన్ని ఏర్పాటుచేసుకోవాలి. ఈ మండపం పైన బియ్యపు పిండితో ముగ్గువేసి, కలశం ఏర్పాటుచేసుకోవాలి. అమ్మవారి ఫొటో లేదా రూపును తయారుచేసి అమర్చు కోవాలి. పూజాసామగ్రి, తోరాలు, అక్షతలు, పసుపు గణపతిని ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలి.

**వరలక్ష్మీ పూజా సామగ్రి:**

పసుపు, కుంకుమ, గంధం, విడిపూలు, పూల మాలలు, తమలపాకులు, 30 వక్కలు, ఖర్జూరాలు, అగరవత్తులు, కర్పూరం, చిల్లర పైసలు, తెల్లని వస్త్రం, రవికల గుడ్డ, మామిడి ఆకులు, ఐదు రకాల పండ్లు, అమ్మవారి ఫోటో, కలశం, కొబ్బరి కాయలు తెల్ల దారం లేదా నోము దారం, లేదా పసుపు రాసిన కంకణం, ఇంటిలో తయారుచేసిన నైవేద్యాలు, బియ్యం, పంచామృతాలు. దీపపు కుందులు, ఒత్తులు, నెయ్యి.

**వరమహాలక్ష్మీ అమ్మవారి కలశ స్థాపన, అలంకరణ**

శ్రావణమాసం పేరు చెప్పగానే గుర్తుకువచ్చేది వరలక్ష్మీ వ్రతం. తెలుగు రాష్ట్రాల్లోని హిందువులు అందరూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. లేకపోతే ఎవరైనా చేస్తే వెళ్లి తీర్థప్రసాదాలు, శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం రోజున తెల్లవారుజామునే నిద్రలేచి, అభ్యంగన స్నానాన్ని ఆచరించాలి. ఇంటికి ఈశాన్య భాగంలో ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టి, మండపాన్ని ఏర్పాటుచేయాలి. మండపంలో బియ్యం పోసి అందంగా తీర్చిదిద్ది, అందులో కలశాన్ని ఉంచి, మర్రి, మామిడి, మేడి, జువ్వి, రావి చిగుళ్లను అందులో వేయాలి. కలశంపై కొబ్బరికాయ ఉంచి, ఎరుపు రంగు రవిక గుడ్డను దానికి అలంకరించాలి. తొలుత కొబ్బరికాయను నునుపుగా చేసి, ఎక్కువ వెడల్పు ఉండే భాగంలో అమ్మవారి ముఖాన్ని తయారుచేయాలి. ముఖం ఏర్పాటుచేసే భాగంలోనే పసుపును ముద్దలాచేసి కొబ్బరికాయకు అద్దాలి. తర్వాత కొద్దిగా పొడి పసుపును తీసుకుని దానిపై చల్లాలి. అనంతరం మైదా పిండి తీసుకుని, అందులో కొంచెం పసుపువేసి కలపాలి. ఈ ముద్దను వేలితో బలపంలా వత్తుకుని అమ్మవారికి చెవులు, ముక్కును తయారుచేయాలి. ముందు చెవులు, తర్వాత ముక్కును కొబ్బరికాయకు పసుపు అద్దిన భాగంలో ఉంచాలి. అనంతరం సన్నని అగ్గిపులతో కళ్లను ముక్కుకు ఇరువైపులా మార్కింగ్ చేసుకోవాలి. కనుబొమలు కూడా గీసి, కను పాపలకు బియ్యపు పిండి, తర్వాత కాటుకను అద్దాలి. దీనిని పక్కన ఉంచి, కలశానికి ఓ పెద్ద చెంబును తీసుకుని దానికి మధ్యలో ఓ కర్రను కట్టాలి. మరో మర చెంబును తీసుకుని ఎడమవైపునకు ఎక్కువగా ఉండేలా మరో చిన్న కర్రను కట్టి, దాని చుట్టూ రవికల గుడ్డను చుట్టాలి. పెద్దదానిపై చిన్న మర చెంబును ఉంచి, చీరలో మూడో వంతు భాగాన్ని కుచ్చిళ్లుగా వేసి అలకరించాలి. తర్వాత చేతులను అమ్మవారికి అమర్చాలి. అభయ హస్తం కొద్దిగా వెనుక్కు వదరహస్తం కొద్దిగా ముందుకు ఉండేలా చూసుకోవాలి. కలశంపై అమ్మవారు నిలబడటానికి వీలుగా బేబీ పిల్లోలా ఉండే ఆకారాన్ని ఉంచాలి. అమ్మవారి ముఖం కలశంపైకి ఉంచడానికి ముందే నగలను అలంకరించాలి. అమ్మవారి మెడలా వాటిపై చిన్న మట్టుగిన్నె ఉ ంచాలి. ఇది కంఠంలా ఉంటుంది కాబట్టి, కంఠాభారణం ఉంచాలి. తర్వాత చెవుపోగులు, ముక్కుపుడక ఉంచి, కలశంపై ముఖాన్ని ఏర్పాటుచేయాలి. తర్వాత బరువు తక్కువ ఉండే కిరీటం శిరస్సుపైన ఉంచాలి. తర్వాత వరలక్ష్మీదేవిని ఆవాహనం చేయాలి. వరలక్ష్మిని కీర్తిస్తూ ధ్యాన ఆవాహన షోడశోపచారాలు, అష్టోత్తరశత నామాలతో అర్చన చేయాలి. అమ్మవారిని అష్టోత్తర శత నామాలలో ఒక్కొక్క నామానికి ఓ విశిష్టత ఉంది. వేదాల్లో వీటికి సంబంధించి 108 కథలున్నాయి. బ్రహ్మ వైకవర్త, విష్ణు, స్కంద, పద్మ, ఖాండ పురాణాల్లో లక్ష్మీదేవి వైభోగం, పూజాప్రాశస్త్యం గురించి పేర్కొన్నారు.

**తోరం తయారు చేసుకోవడం:**

తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాయాలి. ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేయాలి. అంటే ఐదు లేక తొమ్మిది పోగుల దారాన్ని ఉపయోగించి, ఐదు లేక తొమ్మిదో పువ్వులతో ఐదులేక తొమ్మిది ముడులతో తోరాలను తయారుచేసుకుని, పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు వేసి, తోరాలను పూజించి ఉంచుకోవాలి. ఆవిధంగా తోరాలను తయారుచేసుకున్న తరువాత పూజకు సిద్ధంకావాలి.

**తోరపూజ**

తోరాన్ని అమ్మవారి వద్ద ఉంచి అక్షతలతో తోరపూజ మంత్రపఠనంతో పూజించాలి. ఆ శ్లోకం చదువుతూ తోరం కట్టుకోవాలి.
బద్నామి దక్షిణేహస్తే నవసూత్రం శుభప్రదం
పుత్రపౌత్రాభివృద్ధించ మమ సౌభాగ్యం దేహిమే రమే

**వరలక్ష్మీ వ్రత కథ**

పూర్వం శౌనకాది మహర్షులను ఉద్దేశించి సూత మహర్షి ఇలా చెప్పారు. మునులారా! స్త్రీలకు సౌభాగ్యాన్ని ప్రసాదించే ఒక వ్రతాన్ని పరమ శివుడు పార్వతికి చెప్పారు. లోకోపకారం కోరి ఆ వ్రతాన్ని గురించి మీకు తెలియజేస్తాను. శ్రద్ధగా వినండి అన్నారు. పరమేశ్వరుడు ఒకనాడు తన భస్మసింహాసనంపై కూర్చుని ఉండగా నారదమహర్షి, ఇంద్రాది దిక్పాలకులు స్తుతి స్తోత్రాలతో ఆయను కీర్తిస్తున్నారు. ఆమహత్తర ఆనంద సమయంలో పార్వతీదేవి పరమేశ్వరుడ్ని ఉద్దేశించి ప్రాణేశ్వరా! స్త్రీలు సర్వసౌఖ్యాలు పొంది, పుత్ర పౌత్రాభివృద్ధిగా తరించుటకు తగిన వ్రతం ఒకదానిని చెప్పండి అని కోరింది. అందుకా త్రినేత్రుడు దేవీ! నీవు కోరినవిధంగా స్త్రీలకు సకల శుభాలు కలిగించే వ్రతం ఒకటి ఉన్నది. అది వరలక్ష్మీవ్రతం. దానిని శ్రావణమాసం రెండో శుక్రవారం నాడు ఆచరించాలని తెలిపాడు. అప్పుడు పార్వతీదేవి దేవా! ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ఆదిదేవతలు ఎవరుచేశారు? ఈ వ్రతాన్ని ఎలా చేయాలో వివరంగా చెప్పండని కోరింది. కాత్యాయనీ పూర్వకాలంలో మగధ దేశంలో కుండినం అనే పట్టణం ఒకటి ఉండేది. ఆపట్టణం బంగారు కుడ్యములతో రమణీయంగా ఉండేది. ఆ పురంలో చారుమతి అనే ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె సుగుణవతి. వినయ విధేయతలు, భక్తి గౌరవాలు గలయోగ్యురాలు. ప్రతిరోజూ ప్రాతఃకాలాన నిద్రలేచి భర్త పాదాలకు నమస్కరించి ప్రాతఃకాల గృహకృత్యాలను పూర్తిచేసుకుని అత్తమామలను సేవలో తరించేంది.



- శృంగేరి శారద
ఆధ్యాత్మిక రచయిత్రి

**వరలక్ష్మీ సాక్షాత్కారం**

వరలక్ష్మీ వ్రతానికి ఆదిదేవతయైన వరలక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. ఓ చారుమతీ ఈ శ్రావణ పౌర్ణమి నాటికి ముందు వచ్చే శుక్రవారం నాడు నన్ను పూజించు... నీవు కోరిన వరాలు, కానుకలను ఇస్తానని చెప్పి అంతర్థానమైంది. చారుమతి సంతోషించి. హే జననీ! నీకృపా కటాక్షాలు కలిగినవారు ధన్యులు. వారు సంపన్నులుగా, విద్వాంసులుగా మన్ననలు పొందుతారు. ఓ పావనీ! నా పూర్వజన్మ సుకృతం వల్ల నీ దర్శనం నాకుకలిగింది' అని పరిపరివిధాల వరలక్ష్మీని స్తుతించింది. అంతలోనే మేల్కొన్న చారుమతి అదంతా కలగా గుర్తించి తన కలను భర్తకు, అత్తమామలకు తెలియజేసింది. వారు చాలా సంతోషించి చారుమతిని వరలక్ష్మీవ్రతాన్ని చేసుకోమని చెప్పారు. పురంలోని మహిళలు చారుమతి కలను గురించివిని వారు కూడా పౌర్ణమి ముందు రాబోయే శ్రావణ శుక్రవారం కోసం ఎదురుచూడసాగారు. శ్రావణ శుక్రవారం రోజున పట్టణంలోని స్త్రీలందరూ ఉదయాన్నే లేచి తలారాస్నానం చేసి పట్టువస్త్రాలు ధరించి చారుమతి గృహానికి చేరుకున్నారు. చారుమతి తన గృహంలో మండపం ఏర్పాటుచేసి ఆ మండపంపై బియ్యంపోసి పంచపల్లవాలైన రావి, జువ్వి, మర్రి, మామిడి, ఉత్తరేణి మొదలైన ఆకులతో కలశం ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని సంకల్ప విధులతో సర్వమాంగళ

మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే ! అంటూ ఆహ్వానించి ప్రతిష్టించింది. అమ్మవారిని షోడశోపచారాలతో పూజించి, భక్ష్య, భోజ్యాలను నివేదించారు. తొమ్మిది పోగుల తోరాన్ని చేతికి కట్టుకుని, ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. మొదటి ప్రదక్షిణ చేయగానే కాలి అందియలు ఘల్లుఘల్లున మోగాయి. రెండో ప్రదక్షిణ చేయగానే హస్తాలకు నవరత్నఖచిత కంకణాలు ధగధగా మెరవసాగాయి. మూడో ప్రదక్షిణ చేయగానే అందరూ సర్వాభరణభూషితులయ్యారు. వారు చేసిన వరలక్ష్మీ వ్రతం ఫలితంగా చారుమతి గృహంతో పాటు, ఆపట్టణంలో ఇతర స్త్రీల ఇళ్లు కూడా ధన, కనక, వస్తు వాహనాలతో నిండిపోయాయి. వారి వారి ఇళ్ల నుంచి గజ తరగరథ వాహనాలతో వచ్చి ఇళ్లకు తీసుకెళ్లారు. వారంతా మార్గమధ్యంలో చారుమతిని వేనోళ్ల పొగుడుతూ ఆమెకు వరలక్ష్మీ దేవి కలలో సాక్షాత్కరించి అనుగ్రహించగా ఆమె చేసిన వ్రతంతో తమని కూడా మహద్భాగ్యవంతులను చేసిందని ప్రశంసించారు. వారంతా ఏటా వరలక్ష్మీవ్రతం చేసి సకల సౌభాగ్యాలతో సిరిసంపదలుకలిగి, సుఖజీవనం గడిపి ముక్తిని పొందారు. మునులారా! శివుడు పార్వతికి ఉపదేశించిన ఈ వరలక్ష్మీవ్రత విధానాన్ని సవిస్తరంగా మీకు వివరించాను. ఈ కథ విన్నా, ఈ వ్రతం చేసినా, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు సిద్ధిస్తాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు చెప్పారు. ఈ కథ విని అక్షతలు శిరసుపై వేసుకోవాలి. ఆ తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇవ్వాలి. అందరికీ తీర్థప్రసాదాలు ఇచ్చి, పూజ చేసినవారు కూడా వాటిని తీసుకోవాలి. అమ్మవారికి పెట్టిన నైవేద్యాన్ని వాళ్లే ఆరగించాలి. రాత్రి ఉపవాసం ఉండి, భక్తితో వేడుకుంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీని పూజించడం చాలా శ్రేష్ఠం. శ్రీహరి జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు దక్కుతాయి. సర్వమంగళ సంప్రాప్తి, సకలాభీష్టం, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని మహిళలు ఈ వ్రతం చేస్తారు. వరలక్ష్మీ వ్రతంతో మనకు సర్వం ప్రాప్తిస్తాయి. శ్రీ (ధనం), భూ (భూమి), సరస్వతి (చదువు), ప్రీతి (ప్రేమ), కీర్తి, శాంతి, తుష్టి (సంతోషం), పుష్టి (బలం) కలుగుతాయి. నవకాయ పిండి వంటలు, ఫలాలను నైవేద్యంగా సమర్పించి, తొమ్మిది దారాలతో తయారు చేసిన తోరాన్ని అర్చించి, దాన్ని కుడిచేతికి కట్టుకోవాలి. భక్తితో ప్రదక్షిణపూర్వక నమస్కారాలు పూర్తిచేసి ఇంటికి వచ్చిన ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకోవాలి. వరలక్ష్మీ తల్లి దీవెనలతో ఆరోగ్య ఐశ్వర్యాల అభివృద్ధితో సర్వమానవాళి వర్ధిల్లుగాక!

**సర్వేజనాః సుఖినోభవంతు.**

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# యుద్ధం ఆగే సూచనే లేదు

రష్యా, ఉక్రైన్ యుద్ధం కొత్త దిశలో పయనిస్తోంది. రష్యా భీకర దాడులు చేస్తూ, ఉక్రైన్ ని వణికిస్తోంది. యుద్ధం ఆపుతానని అగ్ర దేశ నేత సైతం మౌనం వహించి, ఉక్రైన్ వంకే ఉండటం రష్యాకు ఆగ్రహం కలిగించింది. దానికి తోడు జెలెన్ స్కి ప్రకటనలు మాస్కో కు ఆగ్రహం తెప్పించింది. ఆ ప్రకటనల సారాంశం ఏమిటంటే రష్యాకు, చైనా, పాక్ సైనికుల అండ ఉంది అనే మాట. వాస్తవానికి రష్యాకు ఒక్క ఉత్తరకొరియానే బాహాటంగా మద్దతు ఇస్తోంది.పాక్ కూడా రష్యాకు అండగా ఉంది అనే మాట పాక్ గట్టిగా ఖండించింది. కీవ్ అధికారులు ఎవ్వరూ తనను సంప్రదించలేదని పాక్ పేర్కొంది. మేము ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదు అని పాక్ చెప్పడం, ఆ దిశలోనే చైనా కూడా మాకు సహాయం అందించింది అని ఉక్రైన్ చెప్పడం తో చైనా, ఉక్రైన్ ఆరోపణలను ఖండించింది. ఇది ఇలా ఉండగా ఉక్రైన్ లోని వోవ్ ఛాన్స్క ప్రాంతంలో తమ సైనికులతో జెలెన్ స్కి భేటీ కావడం సైనికులలో కొత్త ఉత్సహాన్ని నింపినట్లు అయింది. ఉక్రైన్ కు మద్దతుగా చైనా, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, పాకిస్తాన్ తో సహా ఆఫ్రికా దేశాలు కూడా పాలు పొందాయి. వీరందరికి జెలెన్ స్కి ధన్యవాదాలు చెప్పడం, పాక్, చైనా దేశాలు మేము ఉక్రైన్ కు అసలు మద్దతే ఇవ్వ లేదు అని చెప్పడం, ఉత్తర కొరియా మాత్రం మేము రష్యాకు మద్దతు ఇస్తాం. ఆయుధాలు ఆ దేశానికి సమాకూరుస్తాం, ఇప్పటికే ఉత్తర కొరియా వెయ్యి కి పైగా బలగాలను పంపింది. ఆయుధాలు కూడా రష్యాకు అందిస్తామని ప్రకటించింది. ఉత్తర కొరియా, రష్యా ప్రక్కన దిగితే మాత్రం ఉక్రైన్ కు గడ్డు కాలమే. అందుకనే ఉక్రైన్ ఎక్కువగా అమెరికా పై ఆధారపడుతూ, యుద్ధాన్ని ఆపాలనే ఆలోచన లేకుండా, పౌరుల సంక్షేమం, దేశ అభివృద్ధి పట్టక ఇతర దేశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. పరస్పర దాడులు రెండు దేశాలు చేసుకుంటూ యుద్ధాన్ని మరో కోణంలోకి తీసుకు వెళ్ళారు. దీనికి తోడు అగ్రనేత ఆ దేశాలపై సుంకాలు పెంచుతామనే ప్రకటన కూడా మంచిది కాదు. యుద్ధం ఆపే ప్రయత్నం అమెరికా నేత చేయాలి. అమెరికా మాట ఉక్రైన్ వింటుంది. ఉక్రైన్ కు తగిన విధంగా చెబితే యుద్ధం ఆగుతుంది. రెండూ దేశాల మధ్య రాజీ నే విశ్వానికి కావాల్సింది. శాంతి దూత నేనే అని చెప్పుకునే నేతకు రష్యా, ఉక్రైన్ యుద్ధం ఆగిపోతే నిజంగా దానికి అర్హుడు అవుతాడు. నేను అధికారం లోకి ఉంటే కేవలం ఒక్క రోజులోనే యుద్ధం పరి సమాప్తి చేస్తా అనే మాట నిలబెట్టుకోవాలి కాని ఇలా ఉక్రైన్ కు సహాయ, సహకారాలు ఇవ్వ కూడదు. రష్యా, అమెరికా రెండూ బలమైన దేశాలు, ఐక్యరాజ్య సమితి, భద్రతా సమితిలో శాశ్వత సభ్య దేశాలు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవాల్సిందే. అమెరికా, రష్యా కు బదులు ఉక్రైన్ బుజ్జగించాలి. అమెరికా మాట ఉక్రైన్ తప్పక వింటుంది. వినకపోతే దాని పర్యావసానం ఏమిటో ఉక్రైన్ కు బాగా తెలుసు. యుద్ధం ఆగకపోవటానికి అగ్ర దేశం లోపాయకారిగా ఉక్రైన్ వంక ఉండటమే. అందుకే యుద్ధం ఆగే సూచనలు ఇప్పట్లో కనిపించటం లేదు.

- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027



# తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితం అంకితం





- ఉద్యమానికి వెన్నుముకగా జయశంకర్ సార్...
- అన్యాయాన్ని పసిగట్టి ఉద్యమానికి ఊపిరి
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి
- 91వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య కొత్త పల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాలపట్ల, అసమానతలపట్ల తీవ్రంగా పోరాటం చేశారని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పసిగట్టి ఉద్యమానికి ఊపిరి పోశారని కలెక్టర్ కొనియాడారు. స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశాడన్నారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారని, వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని నూరిపోశారని అయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని, ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, బి.సి.వెల్ఫేర్ అధికారి కేషురాం, వెనుకబడిన సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్‌లో ఘనంగా ఆచార్య జయశంకర్ సార్ జయంతి వేడుకలు

### న్యూ సిటీ కాలనీలోని ఆచార్య జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు



**షాద్ నగర్, మహా:** తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయులు, తెలంగాణ ఉద్యమ మార్గదర్శకులు, స్వరాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించిన ఉద్యమకారులు, నేటితరం ప్రజానీకానికి ఆదర్శప్రాయులు ఆచార్య జయశంకర్ సార్ అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కొనియాడారు. ఆచార్య జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని షాద్ నగర్ మున్సిపాలిటీ న్యూ సిటీ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు అన్ని రంగాలలో వెనుకబడి పోతున్నారని, నిధులు, నీళ్లు ,నియమకాలలో తీవ్ర అన్యాయం జరుగుతుందనే విషయాన్ని గ్రహించిన ఆచార్య జయశంకర్ సార్ ఎలాగైనా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవాలనే దృఢ నిశ్చయంతో తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకులు అయ్యారని గుర్తు చేశారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ తో పాటు లక్షలాదిమంది తెలంగాణ ఉద్యమకారులు, మేధావులతో కలిసి తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడపడంలో ఆయన పోషించిన పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. తెలంగాణ తలెత్తి నిలవాలంటే ఆచార్య జయశంకర్ సార్ ఆశయాలు నెరవేరాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ తొలి ఉద్యమ సమయంలో నాటి నుంచి స్వరాష్ట్రాన్ని సాధించుకునే అంతవరకు ఆయన పోరాటపటిమ నేటితరం నాయకులకు, ప్రజానీకానికి ఆదర్శనీయమని అభిప్రాయపడ్డారు. ఇడ్లీ సాంబార్ గో బ్యాక్, ముల్కీ నాన్ ముల్కీ అనే నినాదాలతో మొదటి దశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర లక్షలాదిమంది తెలంగాణ ప్రజలను జాగృతం చేసిందని చెప్పారు. మహా మేధావి అయిన ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు ఘన నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజవరప్రసాద్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మన్నె కవిత నారాయణ, పార్టీ అధ్యక్షులు నటరాజ్, లక్ష్మణ్ నాయక్, రాఘవేందర్ రెడ్డి, మాజీ లైబ్రరీ చైర్మన్ లక్ష్మీనరసింహా రెడ్డి, సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉండాలి

### అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధన



**రాజేంద్రనగర్ మహా ;** పి ఎం సి లో భాగంగా మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరి పట్టికతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారు, భోజనంలో ఎన్ని రకాల వంటకాలు వడిస్తున్నారో, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మణికొండ జిల్లా పరిషత్ హై స్కూల్లో 89% ఉత్తీర్ణత సాధించారు. ఈ సంవత్సరం 100% శాతం ఉత్తీర్ణులై పాఠశాల పేరు నిలబెట్టాలన్నారు. మణికొండ జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆ ప్రాంత నాయకుల దాతల తోడ్పాటుతో లైబ్రరీ, లాబరేటరీ, స్పోర్ట్స్ కు సంబంధించిన ఆటలను జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధాన ఉపాధ్యాయుడు తో కలిసి అయిన ప్రారంభించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఎదగాలన్నారు. ప్రైవేటు టీచర్ల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నత విద్య చదియ్యారు, రాత పరీక్షలలో ఉత్తీర్ణులైనారు. వారి బోధనలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలన్నారు. మణికొండ జిల్లా పరిషత్ హై స్కూల్ పి ఎం సి లో చేరింది. ఐదు కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాల మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, పేరెంట్స్ కమిటీ సభ్యులు, లక్ష్మణరావు, నరేందర్ రెడ్డి, శ్రీరాములు, లక్ష్మణరావు, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## నెక్నంపూర్ పెద్ద చెరువును కాపాడండి

- డ్రైనేజీ నీరు చెరువులో చేరడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు
- డ్రైనేజీ కోసం ప్రత్యేక లైను ఏర్పాటుకు బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్నంపూర్ పెద్ద చెరువును మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం సందర్శించారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ 400 ఏళ్ల చరిత్ర కలిగిన కూలి కుతుబ్షా కాలం నాటి నుండి ఉన్న 99 ఎకరాల నెక్నంపూర్ ఇబ్రహీం బాగ్ పెద్ద చెరువు మణికొండ మునిసిపల్ పరిధిలో ఉండడంతో డ్రైనేజీ మురుగునీరుచెరువులోకి చేరి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతు డేంగీ, మలేరియా, వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారు. గత ప్రభుత్వం లో సర్వే నెంబర్ 32 నుంచి 44 వరకు ఉన్న శిఖం భూములు ప్రభుత్వ ఆధీనంలోఉన్నాయి. శిఖం భూముల్లో పది ఎకరాలు మురుగునీటి శుద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెరువును అభివృద్ధి పరచాలని 22 కోట్లు మంజూరయ్యాయి. కానీ ప్రణాళిక లోపమో లేక అధికారుల తప్పిదమో మురికినీటి శుద్ధి కేంద్రాన్న జనావాసాలకు దగ్గరగా నిర్మించడానికి ప్రయత్నించారు. స్థానికులు వ్యతిరేకించారు. చెరువుకు సంబంధించిన బఫర్ జోన్ ఆక్రమణకు గురి అయింది. మంజూరైన 22 కోట్లలో దాదాపు 8 కోట్లు వెచ్చించి, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ చిన్న చిన్న బ్రిడ్జిలను నిర్మించారు. మురుగు నీటితో పాటు పెద్ద చెరువులో చెత్తా చెదారంతో పేరుకు పోయాయి. ప్రభుత్వ సొమ్ము వృధా ప్రాయసగానే మిగిలింది. పెద్ద చెరువులో చేరుతున్న మురుగు నీటిని, పెద్ద చెరువు నుంచి మూసికి పోయే మురికి నీటి వ్యవస్థను అభివృద్ధి పరచడంలో కౌన్సిల్ విఫలమయ్యింది. మురికి నీటిని నేరుగా మూసిలో కలిపే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్. కార్యక్రమంలో మణికొండ బిఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, మాజీ కౌన్సిలర్ పద్మారావు, ధనరాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, శ్రీకాంత్, మహమ్మద్ ఆరిఫ్, యాలాల కిరణ్, సుమనళిని, సుమన్, షేక్ ఆరిఫ్, బాబురావు, ప్రవీణ్ కుమార్, తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి రాందేవ్ బాబా సంకీర్తన మందిర్

### నూతన కమిటీ సభ్యులు రాందేవ్ బాబా మందిరం అభివృద్ధి పై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రాజేంద్రనగర్ మహా ;** మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని, శివరాంపల్లి రాందేవ్ బాబా సంకీర్తన,నూతన మందిర్ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని మందిరానికి ఆహ్వానించారు. రాందేవ్ బాబాకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో రాందేవ్ బాబా మందిరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, నార్సింగ్ మార్కెట్ డైరెక్టర్ బండారి శంకర్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగులతో జాగ్రత్తలు పాటించాలి

### షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి



**షాద్ నగర్, మహా:** నులిపిరుగులతో జాగ్రత్తలు పాటించాలని షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల ఆగస్టు 11 వ తారీకు న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం గురించి ఫరూక్ నగర్ మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు ప్రధానోపాధ్యాయులకు మరియు అంగన్వాడి సూపర్వైజర్లకు డాక్టర్ వి.విజయలక్ష్మి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ శిక్షణ కార్యక్రమాన్ని షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ ఆఫీసులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ నులిపురుగులు అనేవి మానవులలో ప్రేగుల నుండి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెంది పరాన జీవులు అని, ఇవి మూడు రకాలు అని. ఎలిక పాములు నులిపురుగులు కొంకి పురుగులు అని చెప్పారు. నులిపురుగులు పిల్లలు ఆరు బయట వట్టి కాళ్లతో ఆడుకొనుటవలన, చేతులు కడుక్కోకుండా ఆహారము భుజించుటవలన, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయుట వలన, మరియు అపరిశుభ్ర పరిసరాలలో నివసించడం వలన సంక్రమిస్తాయని జే. శ్రీనివాసులు తెలియజేశారు. నులిపురుగులు పిల్లల కడుపులో ఉండడం వలన రక్తహీనత, పోషకాలలోపం, ఆకలి లేకపోవుట, బలహీనత మరియు ఆందోళన, కడుపునొప్పి, వికారము, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారికి ఆల్బెండజోల్ మాత్ర మింగించినట్లైతే, పిల్లల్లో రక్తహీనతను నియంత్రిస్తుంది అని, పోషకాల గ్రహతను మెరుగుపరుస్తుందని, వీటి వలన పిల్లల్లో ఏకాగ్రత, విద్యను నేర్చుకోగల సామర్థ్యంను, పని సామర్థ్యాన్ని పెంచుతుందని, పర్యావరణంలో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించి సమాజానికి మేలు చేస్తుందని జె.శ్రీనివాసులు తెలియజేశారు. తదుపరి డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు 11 వ తారీఖున అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు స్కూళ్లలో మరియు కాలేజీలోని 1 నుండి 19 వయసు గల విద్యార్థులందరికీ ఆల్బెండెడ్ జోల్ టాబ్లెట్ల ను మింగించాలని చెప్పారు. 1 నుండి 2 సంవత్సరముల విద్యార్థులకు ఆఫ్ టాబ్లెట్ క్రష్ చేసి వాటర్ లో కలిపి తాపాలని చెప్పారు, 2 నుండి 3 సంవత్సరముల విద్యార్థులకు ఒక టాబ్లెట్ పౌడర్ చేసి వాటర్ లో కలిపి తాపాలని తెలియజేశారు. 4 నుండి 19 సంవత్సరం గల విద్యార్థులకు ఒక ఆల్బెండజోల్ టాబ్లెట్ ను నమిలి మింగమనీ చెప్పాలని తెలియజేశారు. ఈ ఆల్బెండజోల్ మాత్రలను ఒకేరోజు అన్ని స్కూళ్లలోని విద్యార్థులకు మింగించడం వలన ఈ నులిపురుగుల సంక్రమణ వ్యాప్తిని అరికట్టవచ్చని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు మరియు అంగన్వాడి సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేసి జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చించోడు వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, బూర్గుల వైద్య అధికారి డాక్టర్ రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఎం పి హెచ్ ఈ ఓ శ్రావణ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ, అమృత, హెల్త్ అసిస్టెంట్ రెడ్యానాయక్, లింగం రవికుమార్ మరియు ఫరూక్ నగర్ మండలంలోని అన్ని, ప్రైవేటు స్కూల్ ల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు..



## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య మరణం పార్టీకి తీవ్ర నష్టం

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**రాజేంద్రనగర్ మహా ;** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ అయోధ్య రోడ్డు ప్రమాదంలో మరణించడంతో విప్లవ ఉద్యమానికి తీవ్రనష్టమని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ చిన్ననాటి నుండే విప్లవద్యమానికి ఆకర్షితులై విద్యార్థి ఉద్యమం నుండి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అనేక పోరాటాలలో పాల్గొన్నారు. జై లకు వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. నిబద్ధత కలిగిన నాయకుడిని విప్లవ పార్టీ కోల్పోవడం బాధాకరమన్నారు. అయోధ్య లాంటి నాయకుడిని సిపిఐ పార్టీ కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆయన ఆవేదన చెందారు ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, బుద్ధుల జంగయ్య, రామకృష్ణ, పల్నాటి యాదయ్య, బాతరాజు నరసింహ, ఆర్ యాదగిరి, కే నరసింహారెడ్డి, ఎంఏ రియాజ్, నర్రగిరి, కే రాజు, స్వామి, క్రాంతి, వినోద్, శివ తేజ, నితీష్ తదితరులు పాల్గొన్నారు.



## కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు మోక్షం లభించినట్లేనా...

# క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం రెడీ

### ఇండోర్ స్టేడియంలో మౌలిక సదుపాయాలు సిద్ధం చేస్తున్న జిహెచ్ఎంసి

**రాజేంద్రనగర్, మహా ;** కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు మోక్షం లభించినట్లేనా. 16 సంవత్సరాల క్రీడాకారుల కల నెరవేర బోతుందా. సుమారు 20 కోట్ల ఖర్చుపెట్టి 16 సంవత్సరాలనుండి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో పనులు జరుగుతున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇండోర్ స్టేడియానికి భూమి పూజ చేసిచేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలపాటు నత్త నడకన పనులు జరిగాయి. ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాల కాలంలో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు గార్డెన్స్ పనులు జరిగాయి. ఆగస్టు మొదటి వారం నుంచి ఇండోర్ స్టేడియంలో జిహెచ్ఎంసి అధికారులు క్లీనింగ్ పనులు మొదలుపెట్టారు. ఆగష్టు, లేదా సెప్టెంబర్ వరకు ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని జిహెచ్ఎంసి అధికారులు పట్టుదలతో క్లీనింగ్ పనులు చేయిస్తున్నారు. అన్ని సక్రమంగా జరిగితే, ఆగస్టు లేదా సెప్టెంబర్ లో ఉదయం ఐదు నుంచి ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులో ఉంటుంది. క్రీడాకారులు నెలకు సరిపడే డబ్బులు ఆన్లైన్లో చెల్లించి స్టేడియాన్ని వినియోగించుకోవచ్చు. త్రాగడానికి మంచి నీటితోపాటు టాయిలెట్లు సౌకర్యం ఉండాలని క్రీడాకారులు ఆశిస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి ఇండోర్ స్టేడియం అందుబాటులోకి లేకపోవడంతో పావురాలకు నివాసయోగ్యమయ్యాయి. వందల సంఖ్యలో పావురాలు స్టేడియం లోపల బయట మలమూత్ర విసర్జనతో భరించలేని వాసనతో కంపు కొడుతుంది. వాటిని రాకుండా చేయడానికి జిహెచ్ఎంసి అధికారులు తల ప్రాణం తోకకు వచ్చింది. క్రీడా మైదానం చుట్టుముట్టు వల ఏర్పాటు తో వందల సంఖ్యలో పావురాలు మృత్యువాత పడ్డాయి.అవి విసర్జించి మలమూత్రాలను జిహెచ్ఎంసి అధికారులు క్లీనింగ్ పనులు మొదలెట్టారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉదయం పూటనే క్రీడాకారులు ఇండోర్ స్టేడియాన్ని వినియోగించుకోవాలి. అతి త్వరలో విద్యుత్ అలంకరణతో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దగదగా లాడబోతుందని క్రీడాకారులు ఆశిస్తున్నారు.




## షెడ్డుకే పరిమితమైన

# వైకుంఠ రథం

### నియోజకవర్గంలో మంత్రి ఉన్న ఫలితం సున్నా

**మందమర్రి, మహా :** మంత్రి ఇలాకలో షెడ్డుకే పరిమితమైన వైకుంఠ రథం గురించి మందమర్రి మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో స్థానిక మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం మంత్రి ఇలాకల ముందుకు కదలనంటున్న వైకుంఠ రథం అనే పోస్టు వివిధ వాట్సప్ గ్రూపులలో చెక్కర్లు కొట్టింది. ఈ సందర్భంగా ముల్కల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనుషుల పార్థివ దేహాలను వైకుంఠ ధామాలకు తరలించేందుకు గత ప్రభుత్వం వైకుంఠ రథాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని చెప్పారు. అయితే నెల రోజులుగా ఆఖరి మజిలీకి అందుబాటులో ఉండాల్సిన వైకుంఠ రథం అందుబాటులో లేక మందమర్రి పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. అంతేకాకుండా తుది శ్వాస విడిచిన వారి దేహాలను భద్రపరచడానికి వాడే ఫ్రీజర్స్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి వైకుంఠ రథం, ఫ్రీజర్స్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. మందమర్రి మున్సిపాలిటీలో వైకుంఠ రథం గత నెల రోజులుగా నడుస్తలేదు అనేది వాస్తవం కాదని స్థానిక కమిషనర్ తుంగపిండి రాజలింగు స్పష్టం చేశారు. వాహనానికి మరమ్మత్తుల కారణంగా గత వారం రోజులుగా ప్రజలకు అందుబాటులో లేదని వెల్లడించారు. ఈ సమస్యను అధిగమించేందుకు రామకృష్ణాపూర్ మున్సిపాలిటీలోని వైకుంఠ రథాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ రెండు, మూడు రోజుల్లో వైకుంఠ రథం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని హామీ ఇచ్చారు. వాట్సాప్ గ్రూప్ లో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.

## ఎమ్మెల్యేల అనర్హతపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు..?

### పార్టీ ఫిరాయింపుల పాపం కేసీఆర్ దే..?

### జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** పార్టీ ఫిరాయింపులను పరాకాష్టకు తీసుకుపోయిందే కేసీయార్ కదా అని, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి కందుకూరు మండల కేంద్రములో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో అన్నారు. వైస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా టిఆర్ఎస్ అధినేత కెసిఅర్ ఒంటెద్దు పోకడలను నచ్చని శాసనసభ్యులు టిఆర్ఎస్ పార్టీ నుండి నాడు కాంగ్రెస్ పార్టీ లో చేరితే కెసిఅర్ఏమన్నాడు, రాజశేఖరరెడ్డి శాసనసభ్యులను సంతలో పశువులను కొన్నట్లుగా కొంటున్నాడు అని కేసిఅర్ అన్నాడు. తాను అధికారంలోకి వచ్చాకతెలుగుదేశం, కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, ఎస్.పి నుండే కాకుండా, సిద్ధాంతాలకు మారుపేరుగా చెప్పుకొనే కమ్యూనిస్టు పార్టీలనూ కూడ వదల్లేదు... అసలు బీఆర్ఎస్ తప్ప మరో పార్టీయే ఉండకూడదనే అప్రజాస్వామిక, నియంత పోకడలతో కదా నానా ప్రయత్నాలు, ప్రలోభాలు... చివరకు సైద్ధాంతిక నిబద్దత అని పదే పదే చెప్పుకునే పార్టీల సభ్యులను కూడా పొల్యూట్ చేసి, పార్టీ మార్పించి, లేదా కోవర్టులుగా మార్చుకుని, ఎన్నెన్నని ప్రలోభాలు, కుట్రలు, కుంతంత్రాలు చేసారు. 2014లో కాంగ్రెస్ తరుపున 21 మంది ఎమ్మెల్యేలు, అందులో ఏడుగురిని టిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ నుండి 15 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే, అందులో 12 మందిని తన పార్టీలో చేర్చుకున్నారు, వైసిపి నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలను, ఒక ఎంపిని టిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. బిఎస్పి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు గెలిస్తే వారిని చేర్చుకున్నారు. ఎంపిల విషయానికి వస్తే కాంగ్రెస్ నుంచి నల్గొండ ఎంపిగా గెలిచిన గుత్తా సుంఖేందర్ రెడ్డిని, టిడిపి నుండి చామకూరా మల్లారెడ్డిని చేర్చుకున్నారు. 2014 నుంచి 2023 వరకు కాంగ్రెస్ ఎమ్మెల్సీలను బిఆర్ఎస్ లో చేర్చుకుని మండలినలో కాంగ్రెస్ లేకుండా చేసింది బిఆర్ఎస్ పార్టీ. 2018లో ప్రజలు బిఅర్ఎస్ కి 88 సీట్లతో మంచి మెజారిటీ ఇచ్చినా కెసిఅర్ ఫిరాయింపులు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 19 మంది గెలిస్తే, 12 మందిని టిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. తెలుగుదేశం నుండి ఇద్దరు గెలిస్తే వారిద్దిరినీ చేర్చుకున్నారు. ఇంత అప్రజాస్వామ్యకంగా వ్వవరించి నేడు నీతులు మాట్లాడుతూ ఉప ఎన్నకలకూ సిద్ధం కావాలంటూ నిసిగ్గుగా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తూన్నారని పాండురంగారెడ్డి అన్నారు.

# రాజకీయ పలుకుబడితో డిప్యూటేషన్లు

## అక్రమ డిప్యూటేషన్ల పై వెలిజర్ల గ్రామస్తుల ఆగ్రహం

- మొన్న ఫిజికల్ సైన్స్ టీచర్లు నేడు బయోసైన్స్ టీచర్లు
- తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థులకు వేరు వేరు టీచర్లు ఉండాలని విద్యార్థి తల్లిదండ్రుల డిమాండ్
- మా టీచర్లు మాకే కావాలి మా పిల్లల భవిష్యత్తు ఆగం చేయొద్దు
- వెలిజర్ల హెడ్మాస్టర్ తీరు పైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లాలోని ఫరుక్ నగర్ మండలం, వెలిజర్ల గ్రామంలోని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ లో, 258 మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు, ఆరో తరగతిలో కేవలం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులే ఉండగా, 7, 8 ,9 ,10 తరగతులకు ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారు, తెలుగు మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం చెప్పే ఉపాధ్యాయుడు పాఠాలు చెబితే మా విద్యార్థులకు ఎలా అర్థమవుతాయి అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు, అంతేకాకుండా ఇంగ్లీష్ మీడియం చెప్పే ఉపాధ్యాయుడు తెలుగు మీడియం విద్యార్థులకు చెబితే పాఠాలు అర్థమవుతాయా అని నిలదీస్తున్నారు, ప్రభుత్వ బడిని బలోపేతం చేయాలంటారు పాఠశాలలో చదివే విద్యార్థులకు నష్టం చేయడమే కాకుండా పాలసీ మ్యాటర్లో భాగంగా ఇక్కడున్న ఉపాధ్యాయులను వేరే చోటికి పంపి, వేరే దగ్గర పనిచేస్తున్న ఉపాధ్యాయులను తెచ్చి మా విద్య మా విద్యార్థులకు తాత్కాలికంగా బోధన చేయడం ఇది నష్టం కలిగించే విషయమని విద్యార్థుల పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఈ విషయంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు రంగారెడ్డి DEO స్పందించాలని, కోరుతున్నారు, తక్షణమే ఈ డిప్యూటీషలను నిలుపుదల చేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు, గతంలో ఫిసికల్ సైన్స్ టీచర్లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వారి నివాసస్థలకు దగ్గర్లో ఉన్న స్కూల్లో రికమండేషన్ తో డిప్టేషన్ పేరుతో హైదరాబాద్ కు వెళ్లారు, ఈ అక్రమ డిప్యూటేషన్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన పాఠశాల ఉన్నత విద్యాధికారులే రాజకీయ ఒత్తిళ్లకు తలోగ్గి, ఇక్కడ పనిచేసే టీచర్లను మరో దగ్గరికి పంపించడం విద్యార్థులకు అన్యాయం చేయటమే అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ అక్రమ డిప్యూటేషన్లను నిలుపుదల చేయాలని విద్య హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని కోరుతున్నారు, మొన్న మొన్న ఫిజికల్ సైన్స్ చెప్పే టీచర్లు డిప్యూటేషన్ పై వెళ్లగా నేడు బయలాజికల్ సైన్స్ చెప్పే ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో ఇతర గ్రామాలకు ఇతర పాఠశాలకు పంపించడం మా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమేనంటున్నారు వెలిజర్ల గ్రామంలో పనిచేస్తున్నటువంటి హెడ్మాస్టర్ పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఈ పాఠశాలలో గతంలో పనిచేసిన హెడ్మాస్టర్లు మా విద్యార్థులకు నష్టం జరుగుతుంది కాబట్టి నేను రిలీవ్ చేయను అని పట్టుబట్టి, డిప్యూటేషన్ చేసిన టీచర్లను రిలీవ్ చేయకుండా ఆపి, విద్యార్థులకు ఆ సబ్జెక్టును టీచర్ను అందుబాటులో ఉంచే ప్రయత్నం చేసేవారు, ప్రస్తుతమున్న హెడ్మాస్టర్ సుకిందర్ రెడ్డి నామమాత్రపు విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాల అంటే చిన్న చూపు చూస్తూ, పేద విద్యార్థులు పట్ల అలసత్వం ప్రదర్శించడం అని ధోరణి వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి, విద్యార్థుల భవిష్యత్తుకు అన్యాయం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అగ్గిమెల్ల గుగ్గిలం అవుతున్నారు, గ్రామస్తులు అందరూ కూడా ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ను సంప్రదించి మా పాఠశాల బలోపేతానికి మరియు విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు, ఇప్పటికీ రెండు నెలలు గడుస్తున్న జెడ్పిహెచ్ఎస్ వెల్జర్ల హైస్కూల్లో పాఠశాలలో ఫిజికల్ సైన్ టీచర్లు లేకపోవడం వల్ల మా విద్యార్థులు, నీట్, ఐఐటి జేఈఈ పరీక్షలకు పోటీపడే అవకాశం లేకుండా చేస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

# రెడీమిక్స్ ప్లాంట్లను పరిశీలించిన టీఎస్ పీసీబీ అధికారి మహేష్

## మహా పత్రికలో వచ్చిన కథనానికి స్పందన

### జిల్లా కలెక్టర్ కు చేసిన ఫిర్యాదు పై ప్లాంట్ల పరిశీలన.. నిర్వాహకులకు త్వరలో నోటీసులు జారీ తదుపరి చర్యలు




**రంగారెడ్డి జిల్లా మహా:** కొంగరకలాన్ లో కొనసాగుతున్న రెడీమిక్స్ ప్లాంట్లను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి పరిశీలించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ పరిధిలో కొంగరకలాన్, రావిరాల, నాదర్గుల్ గ్రామాల పరిసర ప్రాంతాలలో నిర్మించిన రెడీమిక్స్ ప్లాంట్లను, రీజనల్ రంగారెడ్డి జిల్లా, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి మహేష్ పర్యటించి పరిశీలించారు. గత నెలలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి స్పందిస్తూ... రెడీమిక్స్ వాహనాల అతివేగం కారణంగా, ఘోరమైన రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతుండడంతో, గత నెలలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డికి, కొంగరకలాన్ గ్రామానికి చెందిన నాయకులు రెడీమిక్స్ ప్లాంట్ల పై వాటి నిర్వహణపై, మెటీరియల్ తీసుకెళ్లే లారీలపై, మహా పత్రికలో వచ్చిన కథనాన్ని జత చేస్తూ ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో కలెక్టర్ స్పందిస్తూ కొంగరకలాన్ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును పొల్యూషన్ బోర్డు కు ఫార్వర్డ్ చేస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలపడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి పరిశీలించడం జరిగింది. రెడీమిక్స్ ప్లాంట్లను పరిశీలించిన అధికారి మహేష్ మాట్లాడుతూ... రెడీమిక్స్ ప్లాంట్ల నిర్వాహకులకు త్వరలో నోటీసులు జారీ చేసిన తదుపరి, నిర్వాహకుల వివరణ అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# సింగరేణి ఉద్యోగులకు రక్షణ కరువు

## గనులలో ప్రమాదాలు జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవాలి

### భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మంచిర్యాల జిల్లా కమిటీ




**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రక్షణ కరువైందని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యవర్గ సభ్యులు గోమాస ప్రకాష్, బోడెంకి చందు, దూలం శ్రీనివాస్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మందమర్రి జిఎం కార్యాలయం ముందర సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాలలో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల విధుల నిర్వహణలో భాగంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు, యాజమాన్యం రక్షణ సూత్రాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. తద్వారా వివిధ గనులలో కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులు గాయాలపాలై కొంతమంది చనిపోగా మరికొంతమంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారని వెల్లడించారు. కాల పరిమితి నిండిపోయి,చెడిపోయిన యంత్రాలతో పని చేయిస్తు. ప్రమాదాలకు కారణం అవుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదల నివారణకు సిఅండ్ఎండీ చైర్మన్, డైరెక్టర్లకు, సేఫ్టి జీఎం జోక్యం చేసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం అనే నినాదం ప్రస్తుతం పేరుకే పరిమితమైందని అన్నారు. డీజీఎంఎస్ తో జరిగే త్రిసభ్య కమిటి సమావేశంలో అన్ని కార్మిక సంఘాలను, కాంట్రాక్టు కార్మిక సంఘాలను పిలవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీఎం శ్యాంసుందర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమసా అశోక్, సామల ఉమ రాణి, నాయకులు దాగం శ్రీకాంత్, మహేందర్, సిడం సమ్మక్క, రమాదేవి,నిర్మల, సిడం జంగు బాయి ,రాజేశం, రాజలింగు, పోశం ఉన్నారు.




# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**తలమడుగు మహా:** ప్రొఫెసర్ జయశంకర్ కృషివల్లే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని ఎమ్మార్వో రాజ్ మోహన్ అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో అధికారికంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపెల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పువ్వులు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తహసిల్దార్ రాజ్ మోహన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకై ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు రాష్ట్ర ప్రజలు మర్చిపోలేరని రాష్ట్ర ప్రజల గుండెల్లో ఎప్పుడు చిరస్మరణీయంగా గుర్తుండిపోయే నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, అశోక్ సిబ్బంది లింగన్న, నరేందర్, హరీష్ తదితరులున్నారు.

# ఐదుగురు పేకాటరాయిడ్లు, ఒక గుడుంబా రాయుడు అరెస్ట్

**తలమడుగు మహా:** ఒకే గ్రామ శివారులో ఐదుగురు పేకాటరాయిలు పై గుడుంబా అమ్ముతున్న ఒక వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. తలమడుగు మండలంలోని కోసాయి గ్రామ శివారులో గల గుడుంబా కాస్తున్న వ్యక్తి అదే శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు, తలమడుగు మండల ఎస్సై రాధిక ఆధ్వర్యంలో దాడులు చేయగా కోసాయి శివారు ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారు. వారి దగ్గర రూ.1100 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది. దానితోపాటు అదే శివారు ప్రాంతంలో గుడుంబా అమ్ముతున్నారని సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది రైడ్ చేయగా శ్రీరామ్ మాధవరావు గుడుంబా అమ్ముతూ పట్టుబడ్డారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలియజేశారు.



# భూభారతి దరఖాస్తుల పరిశీలన గడువులోగా పూర్తి చేయాలి

## అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్

**కాటారం, మహా :** భూభారతిలో వచ్చిన దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహాసిల్దార్ కార్యాలయాన్ని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ భూభారతిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని తహాసిల్దార్ తండు శ్రీనివాస్ కు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తూ వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో మండలంలో నీ లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.




# బల్దియాలో ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ జయంతి వేడుకలు

**వరంగల్ మహా;** తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్త పెల్లి జయశంకర్ 92 వ జయంతిని పురస్కరించుకొని బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ జోనా ఇన్చార్జి లు ఎస్ ఈ,సిటీ ప్లానర్ మహేందర్, రవీందర రాడేకర్, హెచ్ ఓ లు రమేష్ ,లక్ష్మారెడ్డి, ఏ ఓ శివలింగం, జే ఏ ఓ సరిత, సూపరిండెంట్ బాకం సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



**వరంగల్ మహా;** తక్షణమే ఆగిపోయిన వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ ఏం సిపిఐయు నగర కమిటీ ఆధ్వర్యంలో ఎం సి పి యు నాయకత్వంలో ఆగిపోయిన బస్టాండ్ ను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దరపు రమేష్ నగర కార్యదర్శి మాలోతు సాగర్, ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం 75 కోట్లతో ఐదు అంతస్తులు 32 ప్లాట్ ఫార్మ్స్ వ్యాపార సముదాయాలు మోడరన్ బస్టాండ్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు అనుకూలంగా నిర్మించాలని నిధులను మంజూరు చేయడం జరిగింది ఆ తర్వాత కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న బస్టాండ్ ను కూలగొట్టి రెండు సంవత్సరాలు కావస్తోంది ఇప్పటివరకు పిల్లర్ కూడా లేపని పరిస్థితి దాపరించిందన్నారు. ఈ జిల్లాలో ఉన్న ప్రజలు రోజుకు రెండు లక్షల మంది బస్సుల్లో వరంగల్ కు వచ్చి వారి అవసరాలను తీర్చుకొని మళ్ళీ వాళ్ళ గమ్యస్థానానికి చేరుకుంటారని తాత్కాలికంగా ఉన్న బస్టాండ్ లో బస్సుల కోసం ప్రజలు గంటల కొద్ది నిలబడి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభుత్వం బస్టాండ్ పట్ల కాలయాపన చేస్తుందన్నాని ప్రజలు రైలు దిగి వస్తున్న ప్రజలకు, కార్మికులకు, అసౌకర్యంగా ఉన్న బస్టాండ్ ను తక్షణమే పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డు ఇరుకుగా ఉండడం మూలంగా వ్యాపారస్తులు రోడ్లమీద వ్యాపారం చేయడం మూలంగా ప్రజలకు ఇబ్బందులు జరుగుతున్నాయని వెంటనే బస్టాండ్ ను అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోని నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్రా ప్రతాప్, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, మాలోతు ప్రత్యూష, ఎగ్గని మల్లికార్జున్, ఐతథం నాగేష్, పరిమళ గోవర్ధన్ రాజ్ రాయి నేనీ ఐలయ్య అడుప యాదగిరి ఎండి మహబూబ్ పాషా గణపాక ఓదేల్ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ చర్యలు భేష్ : కలెక్టర్

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా అటవీశాఖ పరిధిలో పలిమెల మండలంలో వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. బుధవారం పలిమెల మండలంలోని అడవులను డి ఎఫ్ ఓ నవీన్ రెడ్డితో కలిసి కలెక్టర్ సందర్శించారు. మండలంలోని కామన్ పల్లి అడవిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్ టవర్ ను పరిశీలించారు. వాచ్ టవర్ వద్ద సోలార్ పంపుతో నడిచే బోర్వెల్ ను ఏర్పాటు చేసి వన్యప్రాన్లకు మంచినీటి సౌకర్యం కోసం పెద్ద నీటి మడుగును ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు డిఎఫో నవీన్ రెడ్డి నీటి గుంట మరియు పరిసరాలను ఎలా పరిశీలిస్తారో మ్యాప్ ద్వారా విశదీకరించారు. అడవులన్నీ పచ్చదనంతో ఆహ్లాద పరుస్తుండడంతో కలెక్టర్ డీ ఎఫ్ ఓ,అటవీ అధికారులు అటవీ అందాలను వీక్షించారు.

# కాటారంలో ఘనంగా గద్దర్ వర్ధంతి వేడుకలు



**కాటారం, మహా :** కాటారం మండల కేంద్రంలోని గారేపల్లి అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం ప్రజాయుద్ధనౌక గద్దర్ రెండవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి జయశంకర్ భూపాలపల్లి జిల్లా సిగ్గం శిరీష కళాబృందం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ కు గుర్తింపునిచ్చి అవార్డులు ఇస్తోందని తెలిపారు గద్దర్ రచించి పాడిన గేయాలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిందని సాంస్కృతిక బృందం సారథి శిరీష తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజల సమస్యల పైన అనేక పాటలు రాసి ప్రజల్ని చైతన్య పరిచిన గద్దర్ ఆశలను కొనసాగిస్తామంటూ నినాదాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాల పాటలను ప్రజల వద్దకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు చేర్చడంలో ముందుంటారని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం సిగ్గం శిరీష, కమ్మల ప్రవీణ్ కుమార్, జాడి సుమలత, పులి రాధిక, గడ్డం నాగమణి, కాస్త స్వాతి, ఓనపాకల కుమార్, ఆత్మకూరు మహేందర్, చిలుముల మధుబాబు ప్రజలు పాల్గొన్నారు.




# ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

## డిపిఆర్ఓ శ్రీనివాస్

**భూపాలపల్లి, మహా :** ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల నుండి భూపాలపల్లి ప్రభుత్వ 100 పడగల ఆసుపత్రిలో చైర్మన్ అయిలి మారుతి ప్రతిరోజు ఉచిత భోజనం అందజేస్తున్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జయశంకర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి డిపిఆర్ఓ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా భోజనాన్ని హాస్పటల్ కు సందర్శకులకు అన్నం వడ్డించారు అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ జయశంకర్ ఫౌండేషన్ ద్వారా ప్రతిరోజు ఉచిత అన్నదానం చేయడం చాలా అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి , జయశంకర్ ఫౌండేషన్ ఇన్చార్జ్ ఆకుల ప్రతాప్ పాల్గొన్నారు.



# పలిమెల మండలంలో కలెక్టర్ రాహుల్ శర్మ విస్తృత పర్యటన

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విస్తృతంగా పర్యటించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పంకెన గ్రామంలోని కెజిబివి పాఠశాలను సందర్శించి, 6వ తరగతి విద్యార్థుల ప్రతిభను పరీక్షించేందుకు పాఠాలు చదివించారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, వంట గది, సైన్స్ ల్యాబ్ ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. భోజనంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నాణ్యత లోపించకుండా చూసుకోవాలని, ఏవైనా జాప్యం లేదా నిర్లక్ష్యమైతే కఠిన చర్యలతో పాటు అవసరమైతే సస్పెన్షన్ చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు రాబొట్టొచ్చని సూచించారు. అనంతరం పలిమల మండలం కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీకృత కార్యాలయాల భవన నిర్మాణ పనులు, ఏంఆర్ సి భవనాలను పరిశీలించారు. ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి రోడ్డు, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ క్యాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.నర్సరీని పరిశీలించిన కలెక్టర్, నర్సరీలో వెదురు మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. ఈ ప్రాంతం వెదురు మొక్కల పెంపకానికి అనుకూలం కావడంతో వెదురు మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. మొదెడు రేంజ్ పరిధిలోని దట్టమైన అడవులను డీఎఫ్ఓ నవీన్ రెడ్డితో కలిసి సందర్శించారు.అటవీ శాఖ వాచ్ టవర్, అడవుల సంరక్షణ, పెంపకానికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అటవీ శాఖ వాచ్ టవర్ ప్రాంతంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ఖాళీగా ఉన్న అటవీ భూముల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, తహసీల్దార్ అనిల్, ఎంపిడిఓ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# బ్యాంకు కొలువుల జాతర.. ఎస్‌బీఐలో భారీగా ఉద్యోగాలు




దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) భారీ సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. 202526 కాలానికి 5,583 జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సర్వీస్ & సపోర్ట్) ఖాళీలను భర్తీ చేయడానికి పెద్ద ఎత్తున నియామక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ దరఖాస్తు విండో ఆగస్టు 6 నుండి ఆగస్టు 26 వరకు తెరిచి ఉంటుంది. ఎస్‌బీఐ ఇటీవలే 505 ప్రొబేషనరీ ఆఫీసర్లు, 13,455 జూనియర్ అసోసియేట్‌లను నియమించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌బీఐ విస్తృత శాఖలు, కార్యాలయాల నెట్‌వర్క్‌లో సేవా సరఫరా, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి బ్యాంకు తాజాగా నియామకాలు చేపట్టింది. ఈ నియామక డ్రైవ్, ప్రస్తుతం 2.36 లక్షలకు పైగా ఉద్యోగులను కలిగి ఉన్న ఎస్‌బీఐ మానవ వనరుల సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, అభివృద్ధి చెందుతున్న కస్టమర్, సాంకేతిక అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉన్న కొత్త ప్రతిభను నియమించడం లక్ష్యంగా పెట్టుకుంది. “కొత్త ప్రతిభను నియమించడం మా మానవ వనరుల సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంలో కీలక అంశం. నిర్మాణాత్మక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల ద్వారా, బ్యాంకింగ్ రంగాన్ని పునర్‌నిర్మించే క్రియాత్మక, సాంకేతిక పురోగతులతో మా ఉద్యోగులను సమలేఖనం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం” అని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ఈ నియామకం వ్యూహాత్మక ప్రాముఖ్యతను తెలియజేస్తూ పేర్కొన్నారు.

# చనిపోయినవారి బ్యాంకు అకౌంట్లపై కీలక నిర్ణయం



మరణించిన ఖాతాదారుల బ్యాంకు ఖాతాలు, సేఫ్ డిపాజిట్ లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్మెంట్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సెటిల్మెంట్ ప్రక్రియను ప్రామాణీకరించనున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ ప్రకటన చేశారు. చనిపోయినవారి బ్యాంకు ఖాతాలలో ఉన్న సొమ్ము, విలువైన వస్తువులను నామినీలకు లేదా చట్టబద్ధమైన వారసులకు అప్పగించడంలో వివిధ బ్యాంకుల్లో భిన్న ప్రక్రియలను అనుసరిస్తున్నారు. దీంతో క్లయిమ్ సెటిల్మెంట్‌లో ఇబ్బందులు, తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. బ్యాంకులు అనుసరించే ఈ ప్రక్రియలలో ఏకరూపతను తీసుకురావడమే ఈ చర్య లక్ష్యం.

## ఎయిర్‌బస్ ప్రెసిడెంట్‌గా
# జుర్గెన్ వెస్టర్‌మీయర్



ప్రముఖ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ సంస్థ ఎయిర్‌బస్ భారత్, దక్షిణ ఆసియా ప్రాంతానికి ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్‌గా జుర్గెన్ వెస్టర్‌మీయర్‌ను నియమితులయ్యారు. ఈ నియామకం సెప్టెంబర్ 1 నుండి అమలులోకి వస్తుంది. ప్రస్తుతం ఎయిర్‌బస్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్, చీఫ్ ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న జుర్గెన్, రెమీ మైలార్డ్ స్థానంలో ఈ పదవిని చేపడతారు. రెమీ మైలార్డ్ ఎయిర్‌బస్‌లో కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్, టెక్నాలజీ హెడ్‌గా నియమితులవుతారు. తన కొత్త పాత్రలో, జుర్గెన్ భారత్, దక్షిణ ఆసియా ప్రాంతంలో ఎయిర్‌బస్ వ్యాపారాన్ని నడిపిస్తారు. ఇందులో కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్, డిఫెన్స్ అండ్ స్పేస్, హెలికాప్టర్లు ఉన్నాయి. కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ అమ్మకాలకు బాధ్యత వహించనున్న జుర్గెన్ సర్వీసెస్, ఇంజనీరింగ్, డిజిటల్, ఇన్నోవేషన్, శిక్షణ రంగాలలో సంస్థ విస్తరణకు కృషి చేయనున్నారు. జర్మనీలోని యూనివర్శిటీ ఆఫ్ కార్ల్‌స్రూహే నుండి ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ చేసిన జుర్గెన్.. తన కెరియర్‌ను 1998లో బీఎమ్‌డబ్ల్యూలో ప్రారంభించారు. అక్కడ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, మోటార్‌సైకిల్స్ ప్రొక్యూర్‌మెంట్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ అండ్ సప్లయర్ నెట్‌వర్క్, కాస్ట్ ఇంజనీరింగ్ రంగాలలో వ్యూహాత్మక స్థానాలలో పనిచేశారు. జుర్గెన్ 2020లో ఎయిర్‌బస్‌లో చీఫ్ ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్‌గా చేరారు. అక్కడ ఆయన ఎయిర్‌బస్ విభాగాల్లో ప్రొక్యూర్‌మెంట్ బాధ్యతలు చూశారు.

## నిస్సాన్ మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్..
# కళ్లు చెదిరే బ్లాక్ థీమ్



నిస్సాన్ మోటార్ ఇండియా మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను భారత్‌లో ప్రవేశపెట్టింది. దీని ధర రూ .8.30 లక్షలు (ఎక్స్‌షోరూమ్). నిస్సాన్ డీలర్‌షిప్‌లు, నిస్సాన్ ఇండియా వెబ్‌సైట్లో దీని బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. రూ.11,000 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చు. మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను బ్లాక్ కలర్ థీమ్ ఆధారంగా రూపొందించారు. మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్ ఎక్స్‌టీరియర్ లో పియానో బ్లాక్ ఫ్రంట్ గ్రిల్, రెసిన్ బ్లాక్ ఫ్రంట్, రియర్ స్కిడ్ ప్లేట్లు, గ్లాస్ బ్లాక్ రూఫ్ రైల్స్, బ్లాక్ డోర్ హ్యాండిల్స్, 16అంగుళాల డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. ఈ వాహనం ఎడమ ఫెండర్ పై మాగ్నైట్ బ్రాండింగ్ కింద 'కురో' బ్యాడ్జ్ ను ఇచ్చారు. ఈ మోడల్ లో బ్లాక్ డ్యాష్ బోర్డ్, పియానో బ్లాక్ గేర్ షిఫ్ట్ గార్నిష్, పియానో బ్లాక్ స్టీరింగ్ ఇన్సర్ట్, బ్లాక్ సన్ వైజర్స్, బ్లాక్ డోర్ ట్రిమ్స్ ఉన్నాయి. లైట్సాబర్ టర్న్ ఇండికేటర్లతో కూడిన బ్లాక్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, స్టాండర్డ్ సాబిల్ బ్లాక్ వైర్లెస్ ఛార్జర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్ట్ డిస్‌ప్లే ఉన్నాయి. డాష్ క్యామ్‌ను యాక్ససరీగా అందిస్తున్నారు. నేచురల్ ఆస్పిరేటెడ్ పెట్రోల్, టర్బోపెట్రోల్ పవర్ట్రెయిన్లు మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్లో లభిస్తాయి. 1.0లీటర్ నేచురల్ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ (72 పీఎస్, 96 ఎన్ఎమ్) 5స్పీడ్ ఎంటీ లేదా ఏఎంటీతో జత చేయవచ్చు. అలాగే 1.0లీటర్ టర్బోపెట్రోల్ ఇంజన్ (100 పీఎస్, 160 ఎన్ఎమ్)కు 5స్పీడ్ ఎంటీ, సీవీటీ ఆప్షన్లు ఉంటాయి.

## రూ .67,000 కోట్లకుపైగా
# అన్‌క్లెయిమ్ డిపాజిట్లు

బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జూలై 28న పార్లమెంటులో సమర్పించిన ప్రభుత్వ డేటా ప్రకారం, భారతీయ బ్యాంకులు జూన్ 30, 2025 నాటికి రూ .67,000 కోట్లకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లను ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (డీఈఏ) నిధికి బదిలీ చేశాయి. క్లెయిమ్ చేయని మొత్తం డిపాజిట్లలో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా రూ.58,330.26 కోట్లు. ఇందులో ఎస్‌బీఐ రూ.19,329.92 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.6,910.67 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.6,278.14 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో ఐసీఐసీఐ బ్యాంక్ రూ.2,063.45 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.1,609.56 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ రూ.1,360.16 కోట్లు అన్‌క్లయిమ్ డిపాజిట్లు ఉన్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం 10 ఏళ్ల పాటు ఇనాక్టివ్ గా ఉన్న సేవింగ్స్, కరెంట్ అకౌంట్లు, అదేవిధంగా మెచ్యూరిటీ తర్వాత 10 ఏళ్లపాటు క్లెయిమ్ చేయని టర్మ్ డిపాజిట్లను డీఈఏ ఫండ్ కు బదిలీ చేస్తారు. కాగా పాలసీ రెపో రేటును యథాతథంగా 5.5 శాతంగా ఉంచాలని ఆర్బీఐ నిర్ణయించింది. అంతర్జాతీయ టారిఫ్ అనిశ్చితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) రేటును యథాతథంగా కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# భారత్‌పై మరో టారిఫ్ బాంబ్ పేల్చిన ట్రంప్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి టారిఫ్ బాంబు పేల్చారు. అదనంగా మరో 25 శాతం టారిఫ్ విధించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై(Executive Order) ఇవాళ ఆయన సంతకం చేసినట్లు పలు జాతీయ మీడియా చానెల్స్ కథనాలు ఇస్తున్నాయి. ఆగస్టు 27వ తేదీ నుంచి తాజా టారిఫ్ అమల్లోకి రానున్నట్లు సమాచారం. భారత్ మిత్రదేశమే అయినా, వాణిజ్య పరంగా అడ్డంకులు ఎక్కువగా ఉన్నాయి అంటూ గత కొంతకాలంగా ఆయన చెబుతూ వస్తున్నారు. అదే సమయంలో రష్యా నుంచి భారత్ చమురు, సైనిక ఉత్పత్తులను అధిక మొత్తంలో దిగుమతి చేసుకోవడంపైనా ఆయన తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. ఏ దేశంలో లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ అడ్డంకులున్నాయి. రష్యా నుంచి భారీ స్థాయిలో సైనిక ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌పై దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది. భారత్, చైనాలు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నాయి. అందుకే భారత్‌పై 25శాతం సుంకాలు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం అని ఆ సమయంలో అన్నారాయన.

**మరో అల్టిమేటం, ఆ వెంటనే..**

అయితే భారత్‌పై టారిఫ్‌లను పెంచే విషయమై తాజాగానూ ఆయన మరో ప్రకటన చేశారు. ‘‘మాతో భారత్ బాగానే వ్యాపారం చేస్తోంది. కానీ మేం ఆ దేశంతో వ్యాపారం తక్కువగానే చేస్తాం. అందుకే 25శాతం సుంకాలను విధించాం. కానీ 24 గంటల్లో దీనిని భారీగా పెంచనున్నాం. రష్యా నుంచి చమురును కొనడంద్వారా వారు యుద్ధ ఇంజిన్‌కు ఇంధనాన్ని అందిస్తున్నారు. దీంతో నేను సంతోషంగా లేను’’ అని మంగళవారం ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ పరిణామాల తర్వాత కూడా.. రష్యా నుంచి ఇంకా ఆయిల్ కొనుగోలు చేస్తున్నందునే ఆయన మరో 25 శాతం టారిఫ్ వడ్డనతో ఇప్పుడు మరో నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు 50 శాతానికి చేరాయి. తాజా సుంకాల పెంపుపై అర్ధరాత్రి తర్వాత ఆయన అధికారికంగా స్పందించే అవకాశం కనిపిస్తోంది. ట్రంప్ టారిఫ్ మోతపై ఇటు భారత ప్రభుత్వమూ స్పందించాల్సి ఉంది.

**భారత్‌పైనే అత్యధికమా?**

ట్రంప్ ఇప్పటిదాకా అత్యధికంగా టారిఫ్ విధించిన దేశంగా సిరియా ఇప్పటిదాకా ఉంది. 41 శాతం ఒకే విడతలో సిరియాపై అంత మొత్తంలో సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. మయన్మార్&లావోస్‌పై 40 శాతం, స్విట్జర్లాండ్‌పై 39 శాతం, కెనడా.. ఇరాక్‌లపైనా 35 శాతం టారిఫ్ విధించారాయన. అయితే భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు 50 శాతానికి చేరినా.. అది రెండు విడతల్లో ప్రకటించారు. పైగా రెండో దఫా మోపిన 25 శాతం ఇంకా అధికారికంగా అమల్లోకి రాలేదు.



# స్ట్రీట్‌లైట్ ఆంటీ
## భద్రతకు వెలుగుగా నిలిచింది..!

**సాయం అంటే కోట్లు కొద్దీ డబ్బు కుమ్మరించడం కాదు. కేవలం డబ్బు రూపంలో కాదు..ఏ రూపంలోనైన తోడ్పాటుని అందించొచ్చని ప్రూవ్ చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు చాలామంది. సాయం చేయాలన్న సంకల్పంల ఉంటే.. ఏ విధంగానైనా చెయ్యొచ్చని తమ చేతలతో చెప్పకనే చెబుతున్నారు వారంతా. అచ్చం అలాంటి స్టోరీనే నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఆ మహిళ విశాల హృదయానికి ఫిదా అవ్వుతూ.. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు నెటిజన్లు.**

60 ఏళ్ల సన్ మెయిహువా చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లో ఒక చిన్న కిరాయి దుకాణం నుడుపుతోంది. అయితే ఆ దుకాణం వెలుపల లైట్లు ఆ దారిన వెళ్లే బాటసారుల కోసం ప్రతిరోజు సాయంత్రం ఆన్ అయ్యే ఉంటాయి. అంతేగాదు తన దుకాణం మూసివేసే టైమింగ్స్‌ని కూడా మార్పు చేసుకుంది. రాత్రి రెండు గంటల వరకు లైట్లు ఆన్ అయ్యేలా చూస్తుంది సన్.

అలా ఎందుకంటే..ఆ సమయంలో వచ్చే ఆడపిల్లలు, వృద్ధులు, మహిళలు భయం లేకుండా భద్రంగా ఇంటికి వెళ్లేందుకు ఆ వెలుగు దారి చూపిస్తుందనేది ఆమె నమ్మకం. ఆ మహిళ మంచి మనసుని తెలుసుకున్న స్థానికులు కూడా ఆమెకు అనతికాలంలోనే అభిమానులుగా మారడమే గాక నమ్మకస్తురాలైన స్నేహితురాలిగా సన్‌ను విశ్వసించారు.

అంతేగాదు అక్కడి వాళ్లు ఊరెళ్లటప్పుడూ తమ ఇంటి తాళాలు కూడా ఆమెకే ఇచ్చేలా స్థానికుల నమ్మకాన్ని గెలుచుకుంది. దాంతో అక్కడి వాళ్లంతా ముద్దుగా ఆమెను స్ట్రీట్ లైట్ ఆంటీగా పిలుస్తుంటారు. అలాగే తన దుకాణం వద్ద ఒక ల్యాండ్‌లైన్ ఫోన్‌ని కూడా ఏర్పాటు చేసింది. మొబైల్ ఫోన్ లేని పిల్లలు, వృద్ధులకు ఉచితంగా కాల్ చేసుకునేలా ఈ సదుపాయన్ని ఏర్పాటు చేసేందామె.

ఆ మహిళ, తన భర్త అక్కడే 20 ఏళ్లుగా నివాసిస్తున్నారు. తాము కష్టాల్లో ఉన్నప్పుడూ ఈ సమాజమే తమను ఆదుకుందని, అందుకే తమ వంతుగా ఈ విధంగా తిరిగి ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని నవ్వుతూ చెబుతున్నారు ఆ దంపతులు. ఆమె కథ ఆన్‌లైన్‌లో తెగ వైరల్ అవ్వడంతో ..దాతృత్వం, శ్రద్ధకు నిర్వచనం ఆమె అని అంటున్నారు. ఇలా వెలుగుతో దారి చూపేలా చొరవ చూపేందుకు ధైర్యం, ఓపిక ఎంతో కావాల్సి ఉంటుంది. అంత ఈజీగా చేసే సేవా కార్యక్రమం కూడా కాదది అంటూ స్ట్రీట్‌లైట్ ఆంటీపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు.



# ప్రధాని మోదీ చైనా పర్యటన ఖరారు

**ఢిల్లీ:** ప్రధాని మోదీ చైనా పర్యటన ఖరారైంది. ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రధాని చైనాలో పర్యటించనున్నారు. ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో మోదీ చైనా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. తియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సుకు మోదీ హాజరుకానున్నారు. కాtగా, 2020 జూన్‌లో జరిగిన భారత్, చైనా జవాన్ల భీకర ఘర్షణ తర్వాత మోదీ చైనాకు వెళ్తుండడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆయన చివరిసారిగా 2019లో చైనాలో పర్యటించారు. గల్వాన్ లోయ ఘటన తర్వాత భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించాయి. సంబంధాలు పునరుద్ధరించుకోవాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ విషయంలో మోదీ చైనా పర్యటన కీలకమైన ముందడుగు అవుతుందని దౌత్య నిపుణులు అంచనా వేస్తున్నారు. మోదీ చైనా పర్యటన సందర్భంగా చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. మోదీ ప్రధానమంత్రి హోదాలో ఇప్పటిదాకా ఐదు సార్లు చైనాలో పర్యటించారు. దేశ విదేశాల్లో షీ జిన్‌పింగ్‌తో 18 సార్లు సమావేశమయ్యారు.


## 20 వేల అడుగుల ఎత్తులో ఢీకొట్టిన పక్షి..
# విమానాన్ని కమ్మేసిన పొగ..



**మాడ్రిడ్:** 20,000 అడుగుల ఎత్తులో ఆకాశాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్తున్న ఓ విమానాన్ని, అందులోని ప్రయాణికుల గుండెల్లో ఓ చిన్న పక్షి గుబులు పుట్టించింది. బతుకు జీవుడా అనుకుంటూ ప్రయాణికులు ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకున్నారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అవ్వాలని నూటొక్క దేవుళ్లను మొక్కుకున్నారు. ఇంతకీ అసలేం జరిగింది? ఇటీవల కాలంలో విమాన ప్రయాణ ప్రాణ సంకటంగా మారింది. విమానం టేకాఫ్ నుంచి ల్యాండ్ అయ్యే వరకు ఎంత వరకు సురక్షితం అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో టేకాఫ్ అయిన 20 నిమిషాల్లో మాడ్రిడ్ నుంచి పారిస్ వెళ్తున్న ఐబీరియా ఎయిర్‌బస్ ఏ321ఎక్స్ ఎల్ ఆర్‌ను 20,000 అడుగుల ఎత్తులో ఉండగా ఓ చిన్న పక్షి దాని తల భాగాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విమానం తల భాగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఫలితంగా విమానం మొత్తాన్ని పొగ కమ్మేసింది. అప్రమత్తమైన విమాన సిబ్బంది ప్రయాణికులకు ఆక్సిజన్ మాస్కులు అందించారు. పొగలు వ్యాపించడంతో విమానం ప్రమాదానికి గురవుతందనే భయంతో ప్రయాణికులు ఆహాకారాలు చేశారు. చిన్న పిల్లలు ఏడుస్తున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాదంతో అప్రమత్తమైన పైలెట్ విమానాన్ని సురక్షితంగా కిందకు దించారు. దీంతో హమ్మయ్యా అనుకుంటూ ప్రయాణికులు కిందకు దిగారు. ఈ సందర్భంగా విమాన ప్రయాణంలో తనకు ఎదురైన చేదు అనుభవం గురించి ప్రయాణీకుడు జియాన్‌కార్లో సాండోవాల్ మాట్లాడారు. కెప్టెన్ మాట్లాడుతుండగా.. మాకు ఓ పెద్ద శబ్దం వినిపించింది. ఏదో అశుభం జరగతోందని అనుకున్నాం. దేవుడి దయవల్ల మాకు ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురవలేదంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

# అనుష్క శెట్టి ఘాటి.. ట్రైలర్ వచ్చేసింది!

అనుష్క శెట్టి లీడ్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం ఘాటి. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. జాగర్ల మూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా విడుదలైన ఘాటి ట్రైలర్ చూస్తే గంజాయి మాఫియా నేపథ్యంలో ఈ కథను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. 'ఘాట్లలో గాటీలు ఉంటారు సార్' అనే డైలాగ్‌లో ట్రైలర్‌ను ప్రారంభించారు. ట్రైలర్ చూస్తే అనుష్క మరోసారి అరుంధతి తరహాలో రౌద్రంగా కనిపించింది. ట్రైలర్ చివర్లో 'సీతమ్మోరు లంక దహనం చేస్తే ఎట్టుంటదో చూద్దురు గానీ' అనే డైలాగ్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. కాగా.. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రటించారు. ఇప్పటికే పలుసార్లు వాయిదా పడిన ఈ సినిమా వచ్చేనెలలో థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీని తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమాకు నాగవెల్లి విద్యాసాగర్ సంగీతమందిస్తున్నారు.



# 64 ఏళ్ల హీరో.. 32 ఏళ్ల హీరోయిన్

## కామెంట్‌పై ఫైర్ అయిన మాళవిక

పాన్ ఇండియా కథానాయకగా పేరు తెచ్చుకున్న నటి మాళవిక మోహన్. ముఖ్యంగా మలయాళం తమిళం తెలుగు భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈమె ఏ తరహా పాత్రలోనైనా ఒదిగిపోయి నటించగల సత్తా కలిగిన నటి. ప్రస్తుతం ఈమె తమిళంలో కార్తీ కథానాయకుడుగా నటిస్తున్న సర్దార్ 2 చిత్రంలోనూ, తెలుగులో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ది రాజా సాబ్ చిత్రంలోనూ నటిస్తున్నారు. కాగా సోమవారం నటి మాళవిక మోహన్ పుట్టినరోజు ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ది రాజాసాబ్ చిత్రం యూనిట్, సర్దార్ 2 చిత్ర యూనిట్ ప్రత్యేక పోస్టల్ విడుదల చేశారు. కాగా 32 ఏళ్లు టచ్ చేసిన మాళవిక మోహన్ మలయాళంలో మోహన్ లాల్ కు జంటగా హృదయ పూర్వం అనే చిత్రంలో నటిస్తున్నారు. కాగా మోహన్ లాల్ వయసు 64 ఏళ్లు ఆయనకు జంటగా 32 ఏళ్ల మాళవిక మోహన్ నటించడంతో సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు. వాటిపై స్పందించిన మాళవిక మోహన్ నటీనటుల వయసు గురించి గానీ, వయసు వ్యత్యాసం గురించి గానీ మాట్లాడకండి అంటూ హెచ్చరించారు.

ముందు ఇలాంటి విషయాల గురించి మాట్లాడటం ఆపేయండి అంటూ సినిమాలో ప్రతిభను చూడాలి గానీ అర్థం లేని విషయాల గురించి ఆరాలు తీయరాదనే అభిప్రాయాన్ని మాళవిక మోహన్ వ్యక్తం చేశారు.







# ఇంట్లోకి వర్షం నీళ్లు, పాములు..

## కరెంట్, మంచినీటి కనెక్షన్ లేదు.. సూర్య కన్నీళ్లు

సమాజం నాకెంతో ఇచ్చింది.. మరి సమాజానికి నేనేం ఇచ్చాను? అని ఆలోచించేవారు కొద్దిమందే ఉంటారు. వారిలో తమిళ స్టార్ హీరో సూర్య ముందు వరుసలో ఉంటాడు. నిరుపేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించాలన్న సంకల్పంతో సూర్య.. అగరం పేరిట ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాడు. తమిళనాడులో పేద, వెనుకబడిన సామాజిక విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఈ సంస్థ తోడ్పడుతుంది. ఇటీవలే ఈ సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.

**నా జీవితం ఓ సినిమా కథ**

ఈ కార్యక్రమంలో ఓ యువతి.. అగరం ఫౌండేషన్ వల్ల తన జీవితమే మారిపోయిందని స్పీచ్ ఇచ్చింది. ఆమె మాట్లాడుతూ.. నాపేరు జయప్రియ. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్నాను. నా జీవితం చాలా సంతోషంగా సాగుతోంది. మొదట్లో ఆ సంతోషం అన్న పదమే మా జీవితాల్లో లేదు. అదెందుకో మీకు చెప్తాను. ఇదొక సినిమాకథలా అనిపించొచ్చు. మాది చిన్న ఊరు. ఆ ఊరి పేరు అగరం. ఆ గ్రామంలో ఓ తాగుబోతు తండ్రి ఉండేవాడు.

**పూరి గుడిసెలో జీవితం**

అతడితో తాగుడు మాన్పించలేక భార్య మౌనంగా ఏడుస్తూ ఉండేది. వీరికి ఇద్దరు కూతుర్లు. వాళ్లది మట్టి గోడలతో కట్టిన ఇల్లు (పూరి గుడిసె). తాటాకులే ఇంటి పైకప్పు. వర్షం వచ్చిందంటే నీళ్లన్నీ ఇంట్లోకి వచ్చేవి. ఆ ఇంటికి పాములు చుట్టాల్లా తరచూ వస్తుండేవి. ఇదే నా జీవితం. కరెంటు లేదు. ఇంటికి మంచినీటి కనెక్షన్ లేదు. కానీ చదువుకోవాలన్న కోరిక మాత్రం నాకు బలంగా ఉండేది. చదువులోనూ ముందుండేదాన్ని. ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టేదాన్ని.

**నెక్స్ట్ ఏంటి?**

కొంతకాలానికి మేమున్న ఇల్లు కూలిపోయింది. అమ్మానాన్న నిరుపేదలు. ఏమీ చేయలేకపోయారు. చూస్తుండగానే 12వ తరగతి పూర్తి చేశాను. కాలేజీ టాపర్‌గా నిలిచాను. తర్వాతేం చేయాలో తోచలేదు. మా మేడమ్ అగరం ఫౌండేషన్ నెంబర్ ఇచ్చింది. వాళ్లు నాకు సాయం చేస్తారంది. 2014లో అగరం ఫౌండేషన్‌కు కాల్ చేశాను. అప్పుడే నా జీవితం ఆనందంగా ముందుకుసాగింది.

**గోల్డ్ మెడల్**

మంచి కాలేజీలో చేర్పించారు. కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. అన్నా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ అందుకున్నాను. తర్వాత టీసీఎస్‌లో చేరాను. కొంతకాలానికి ఇన్ఫోసిస్‌కు మారాను. నాకున్న ఏకైక కల సొంతిల్లు. నేను సంపాదించిన డబ్బుతో మంచి ఇల్లు కట్టాలి. అందులో అమ్మానాన్న ప్రశాంతంగా నిద్రించాలి. అగరం వల్ల నేను ఈ స్థాయికి వచ్చాను. పెద్ద ఇల్లు కట్టాను.

**గర్వంగా చెప్తున్నా**

ఒకటి కాదు ఇప్పుడు నాకు రెండు ఇండ్లున్నాయని గర్వంగా చెప్తున్నాను. దీనంతటికీ కారణం అగరం ఫౌండేషన్. ఆడపిల్లలకు చదువెందుకు అని ఇప్పటికీ కొందరు అంటుంటారు. అమ్మాయిలను చదవనివ్వండి. చదివితేనే కదా ఏదో ఒకటి చేయగలం అని చెప్పుకొచ్చింది. ఆమె మాటలకు సూర్య కన్నీళ్లు ఆపుకోలేకపోయాడు. ఆమె విజయాన్ని అభినందిస్తూ లేచి చప్పట్లు కొట్టాడు.




# కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి: బ్రహ్మానందం

"కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి.. అప్పుడే ఒక ఫ్రెష్ నెస్ వస్తుంది. అలాగే మన సినిమా మరింత అభివృద్ధి చెందుతుంది. మంచి కామెడీతో సాగే థ్రిల్లర్ చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. ఈ సినిమా నాకు ప్రత్యేకం అని చెప్పగలను. ఎందుకంటే.. యువతరమంతా కలిసి తీసిన ఈ చిత్రంలో నేను జడ్జి పాత్రలో నటించాను'' అని ప్రముఖ నటుడు బ్రహ్మానందం తెలిపారు. నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. బ్రహ్మానందం, యోగి బాబు, ప్రభాస్ శ్రీను ఇతర పాత్రలు పోషించారు. డా.సంధ్య గోలీ సమర్పణలో వేణు సడ్డి, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'గుర్రం పాపిరెడ్డి' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ మురళీ మనోహర్ మాట్లాడుతూ–"డార్క్ కామెడీగా రూ పొందిన చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. "గుర్రం పాపిరెడ్డి' సినిమాని సూపర్ హిట్ చేస్తారని కోరుకుంటున్నాం'' అని జయకాంత్, అమర్ బురా, డా.సంధ్య గోలీ కోరారు. యోగిబాబు మాట్లాడుతూ– "గుర్రం పాపిరెడ్డి' ద్వారా నేరుగా తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో తప్పకుండా తెలుగులో మాట్లాడతాను'' అని చెప్పారు. "ఈ చిత్రంలో సౌధామిని పాత్రలో నటించాను. మా అమ్మ ఈ చిత్రంలో అతిథి పాత్ర చేశారు'' అని ఫరియా అబ్దుల్లా పేర్కొన్నారు. "బ్రహ్మానందంగారు, యోగి బాబుగారు వంటి స్టార్స్‌తో పనిచేయడం సంతోషంగా ఉంది'' అని నరేష్ అగస్త్య చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com